ప్రజాశక్తి
శనివారం 12 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం

14న మహిళలతో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

నా నేల - నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ జె.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెయింట్ పీటర్స్ పాఠశాల ఆవరణ నుండి ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించి, పాల్గొంటారని చెప్పారు. దేశ భక్తి పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల మహిళలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురంలో మంజూరైన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం పనులను కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్ర వారం పరిశీలించారు. రూ.49.26 కోట్లతో మంజూరైన ఈ ఆసుపత్రి పనులను ఎపిఎంఎస్ఐడిసి ఇప్పటికే ప్రారంభించింది. పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు అధికంగా కురవక ముందే ప్రాథమిక పనులు పూర్తి చేయాలని సూచించారు. పునాదుల స్థాయిని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పనులు పక్కాగా చేయాలని, నాణ్యతలో రాజీ ఉండరాదన్నారు. ప్రణాళికాబద్ధంగా చేపట్టడం వల్ల పనులు సకాలంలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రిలో రూ.1.81 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి భవనం సుందరంగా తీర్చిదిద్దాలని, అన్ని పనులు పక్కాగా ఉండాలని అన్నారు. బర్త్ వెయిటింగ్ హెూం, ఐసియు తదితర పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. రన్నింగ్ వాటర్, కాలువలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య రంగంలో జిల్లా ఆసుపత్రి ప్రధాన వనరుగా ఉందని, దీని సేవలు జిల్లా ప్రజలకు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి.వాగ్దేవి పనుల వివరాలు తెలిపారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్ఒ డాక్టర్ బి.జగన్నాథరావు, ఆర్.బి.ఎస్.కె ప్రాజెక్టు అధికారి డా. ధవళ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేందుకు సమాన దృష్టితో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి, ఇండేల లక్ష్మీ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మండలంలో శుక్రవారం పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌక ధరల డిపోలను తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకుల నిల్వలను రిజిష్టర్లలో నమోదును సరిచూశారు, జగనన్న గోరు ముద్ద పథకం మెనూను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి పాఠ్యాంశాల పరిజ్ఞానాన్ని, ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరీక్షించారు. జగనన్న గోరుముద్ద పథకంలో వండిన వంటకాలు మెనూ ప్రకారం సక్రమంగా అందిస్తున్నదీ లేనిదీ ఆహార పదార్థాలను రుచి చూసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా ఉండేలా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చే దిశగా పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారులు ఉదాసీనత చూపకుండా పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డా, బి.అర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలతో ముఖాముఖి నిర్వహించారు. అడిగిన ప్రశ్నలకు విద్యార్థినులు వెంటనే సరైన సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆహార కమిషన్ సభ్యులు పరిశీలించారు. పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న రక్త పరీక్షను ప్రశ్నించగా 39 రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, రక్తహీనత కలిగిన కేసులు ఏమైనా ఉన్నాయా అన్న విషయాలపై ఆరా తీశారు. ప్రసవాల అనంతరం ప్రధాన మంత్రి వయా వందన యోజన పథకం అందజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, మధ్యాహ్న భోజన పథకం ఎడి పి.దామోదరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎమ్.డి. గయాజుద్దీన్, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు, సివిల్ సప్లయ్ మేనేజర్ ఎమ్.దేవుళ్ళ నాయక్, ఎటిడబ్ల్యుఒ బి.సురేష్ కుమార్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కె.ఆర్.రాజు, జిల్లా ఆహార భద్రత అధికారి వై.రామారావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, ఎస్.సంధ్యా రాణి, సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్‌పిహెచ్ఒ జోగిబాబు, పిహెచ్‌సి వైద్యులు పిఎ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, ఎఎస్‌పి, డిఎస్‌పి

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వావి, వరుస మర్చి, అభమూ శుభం తెలియని కన్న కూతురితో పాటు, ఆమె స్నేహితురాలిపై కూడా అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి శుక్రవారం జిల్లా కోర్టు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమాన విధించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. పార్వతీపురం పట్టణం కొత్తవలసకు చెందిన రొంపిల్లి రామకృష్ణ గత ఏడాది జూలైలో తల్లిలేని నాలుగో తరగతి చదువుతున్న తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడడమే కాకుండా, వారంరోజుల తర్వాత ఆమెకు తోడుగా వచ్చిన స్నేహితురాలిపై కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా ప్రతిఘటించిన వీరిపై ఎవరికీ చెప్పొద్దని, చెబితే కొడతానని బెదిరించాడు. ఆ తర్వాత విషయం బయటకుపొక్కడంతో ఇరువురు బాలికలు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టంతో పాటు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులకు అప్పటి డిఎస్‌పి ఎ.సుభాష్ దర్యాప్తు అధికారిగా, దిశ సెల్ డిఎస్పీ ఎస్ఆర్ హర్షిత ట్రయల్ పర్యవేక్షణ నిర్వహించారు. వీరిద్దరు కృషితో ఏడాది కాలంలో ముద్దాయికి శిక్ష వేయించగలిగారు. ముద్దాయిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం పోక్సోకోర్టు జిల్లా జడ్జి షేక్‌సికిందర్‌బాషా ఒక్కో కేసులో ముద్దాయికి 20ఏళ్ళ కఠిన కారాగారా శిక్ష, రూ.10వేలు జరిమాన విధించారు. బాధిత బాలికలు ఒక్కొక్కరికి రూ.4లక్షలు చొప్పున నష్టపరిహారం మంజూరు చేస్తూ తీర్పు అందించారు. ఈ కేసులో చొరవ చూపించిన పోలీస్ సిబ్బంది ఐ.వెంకటరమణ, కె.అప్పలరాజు, ఎం.హరికృష్ణ, రాధను ఎస్‌పి అభినందించారు. విలేకరుల సమావేశంలో ఎఎస్పీ దిలీప్‌కుమార్, దిశా డిఎస్పీ హర్షితలత పాల్గొన్నారు.

మహిళా సంఘసభ్యులను చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళా సంఘ సభ్యులు వ్యాపార నైపుణ్యాలు మెరుగుపరుచుకొని ఎక్కువ లాభాలను ఆర్జించాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కోనసీమ జిల్లా అమలాపురం నుండి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ నాలుగవ విడత కార్యక్రమానికి కలెక్టరు కార్యాలయం నుండి జిల్లాకలెక్టరు నిశాంత్ కుమార్, లబ్దిదారులు వర్చువల్‌గా హాజరైనారు. జిల్లాలో 20,223 పొదుపు సంఘాల్లో 2,34,256 లక్షల రుణ ఖాతాలకు రూ.23.18 కోట్ల రూపాయల వైఎస్ఆర్ సున్నా వడ్డీ చెక్కును లబ్దిదారులకు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వారి వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకోవాలని తెలిపారు. సంఘాలు ఏర్పాటు చేసుకొనే చిన్న తరహా వ్యాపారాలు మరింత లాభదాయకంగా, వడ్డీ భారం లేకుండా నడపడానికి, మెరుగైన జీవనం సాగించడానికి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పొదుపు సంఘాల సభ్యులను వారు చేస్తున్న వ్యాపారాలను గూర్చి అడిగి తెలుసుకొని, నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకొని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారాల్లో పెట్టుబడులు తగ్గి, లాభాలు పెరుగుతాయని తెలిపారు. పొదుపు సంఘాల సభ్యులు వ్యాపారాలు నిర్వహించుకొనేందుకు కావాల్సిన నైపుణ్యాల కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తున్న లక్ష్మీనారాయణపురం నకు చెందిన అల్లు రమాదేవి, కురుపాం మండలం పి.రేవిడికి చెందిన ఆరిక శాంతకుమారి, వీరఘట్టం మండలానికి చెందిన చిదిమి గ్రామానికి చెందిన పెరుమళ్ల సుజాత తమ వ్యాపారాలకు సంబంధించిన అనుభవాలను కలెక్టరుకు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, ఎపిడి సత్యంనాయుడు, లబ్దిదారులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలని

17 నుంచి రిలే నిరాహార దీక్షలు

పూర్ణపాడు - లాబేసు వంతెన సాధన కమిటీ

ప్రజాశక్తి - కొమరాడ

దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాభేసు వంతెన పనులు వెంటనే ప్రారంభించాలని పూర్ణపాడు లాబేసు వంతెన సాధన కమిటీ సభ్యులు వి.ఇందిరా డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 17 నుంచి 26 వరకు కోమట్లపేట వద్ద రిలే నిరాహారదీక్ష, 28న తహశీల్దార్ కార్యాలయం ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో నాగావళి నది ఆవాల గ్రామాలైన పూర్ణపాడు, తులసివలస, మాదలంగిలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు ఇందిర, కె.సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీల్లో తొమ్మిది పంచాయతీలకు 60 గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ వంతెన 2006లో ప్రారంభించి నేటికి 14ఏళ్లయినా 50శాతం పనులు కూడా పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై సిపిఎం ఆందోళన చేసిన సందర్భంలో ఏదో సాకు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారన్నారు. జనవరిలో ఆందోళన చేసిన సమయంలో కాంట్రాక్టర్‌ను రప్పించి పనులు ప్రారంభించిన వెంటనే మళ్లీ కాంట్రాక్టర్ నిధులు ఇవ్వలేదని వెళ్లిపోవడం అన్యాయమని అన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి స్పందించి రూ.14 కోట్లు వెంటనే విడుదల చేసి వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి అటు 60 గిరిజన గ్రామాల ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు వంతెన పనులు పూర్తి చేస్తామని చెప్పినప్పుడు కూడా ఆ దిశగా పూర్తిస్థాయిలో పనులు చేయడంలో అటు పాలకులు కానీ, ఇటు అధికారులకు గానీ చిత్తశుద్ధి లేదని తెలిపారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌కు సంబంధించిన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రజలు యావన్మంది రిలే నిరాహార దీక్షల్లో, ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

రిలేనిరాహార దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాధన కమిటీ సభ్యులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి గోవిందరావు

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశకిత - పార్వతీపురం

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో చేస్తున్నట్లు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పిబి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు పకడ్బందీగా నిర్వహించాలి : పిఒ

సీతంపేట : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియాన్ని సంబంధిత అధికారులతో పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులు, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిడి శ్రీనివాసరావు, ఎపిఒ రోషి రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింహాచలం, ఎటిడబ్ల్యూఒ మంగవేణి, ఐటిడిఎ స్పోర్ట్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12,13తేదీల్లో 'ఐలు' మహాసభలు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 12,13తేదీల్లో ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు గుంటూరులో జరుగనున్నాయి. దీనికి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.తిరుపతిరావు, సభ్యులు లావుడి బాలాజీ పట్నాయక్, కోట లక్ష్మణరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన వృక్షాలను సంరక్షించుకోవాలని అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రాజమండ్రి స్పెషల్ ఫ్లయింగ్ తనిఖీ అధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని కొమరాడ సెక్షన్ పరిధిలో గల పూడేసులో అటవీశాఖ ఏర్పాటు చేసిన టేకు ప్లాంటేషన్ శుక్రవారం పరిశీలించారు. 2018 -19 ఏడాదిలో అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన టేకు మొక్కలను పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. ప్రస్తుతం టేకు ప్లాంటేషన్‌లో 60 శాతం మొక్కలు ఉన్నట్లు ఆయన తెలిపారు. పూడేసు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన పది హెక్టార్లు టేకు ప్లాంటేషన్ అప్పట్లో చేసినట్లు కొమరాడ ఫారెస్టర్ గౌరీ శంకర్రావు తెలిపారు. అనంతరం పార్వతీపురం సెక్షన్‌లో పరిధిలో గల కోనవలసలో ప్లాంటేషన్ ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

కిశోర్ చంద్రదేవ్‌ను కలిసిన బోనెల

కిశోర్‌ను కలిసిన విజయచంద్ర

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు వైరిచర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణదేవ్‌ను కురుపాం కోట వద్ద పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కిషోర్ చంద్రదేవ్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈయనతో పాటు పార్వతీపురం నియోజకవర్గ టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ జిల్లా అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ

నిజాలను నిర్భయంగా రాసే ఏకైక పత్రిక 'ప్రజాశక్తి'

43వ వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణలో కృష్ణాజీ

ప్రజాశక్తి -కలెక్టరేట్

నిజాలను నిర్భయంగా రాసే ఏకైక పత్రిక ప్రజాశక్తి అని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ జిల్లా అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక 43 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ఆవిర్భవించిన రోజు నుండి నేటి వరకు పత్రికా విలువలను పాటిస్తూ బడుగు, బలహీన, కార్మిక, కర్షక వర్గాల సమస్యలను ఎత్తి చూపిస్తూ వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు. అదేవిధంగా ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిజాలను నిష్పక్షపాతంగా రాస్తూ, ప్రజా సమస్యలను గొంతెత్తి వినిపిస్తూ, సమకాలీన పరిస్థితులను అద్దం పడుతూ ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిఇ రత్నకుమార్, సూపరింటెండెంట్ వివి రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ జ్యోత్స్న, జూనియర్ అసిస్టెంట్లు వరప్రసాద్, శ్రీనివాసరావులు, ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ పోలినాయుడు, సిబ్బంది నాగేశ్వరరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి : పిఒ

ప్రజాశక్తి - సాలూరు

తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు సహకరించాలని సాలూరు నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ కోరారు. ఓటరు నమోదు పునశ్చరణ కార్యకలాపాలపై సీతారామ కళ్యాణ మండపంలో శుక్రవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇంటింటికి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం జూలై 21 నుంచి జరుగుతుందని, ఇంటింటికి వెళ్లి ఓటరు ధ్రువీకరణ చేయడం జరుగుతోందని చెప్పారు. రివిజన్ వ్యవధిలో బిఎల్ఒలతో పాటు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సూచించారు. 10 కంటే ఎక్కువ ఫారాలు బిఎల్ఒకు సమర్పించకూడదని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన దరఖాస్తులన్నింటికీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, సెక్స్ వర్కర్స్, థర్డ్ జెండర్, పిడబ్ల్యుడి, ప్రత్యేకించి బలహీన గిరిజన సమూహం, పివిటిజి, అట్టడుగు వర్గాల ఓటర్లను నమోదు చేయడానికి తీసుకున్న చర్యలను నిర్ధారించడం జరుగుతుందని ఆయన చెప్పారు. సమగ్ర ముసాయిదా జాబిత సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 16 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యంతరాలు, క్లెయిమ్ లు డిసెంబరు 26 నాటికి పరిష్కరించడం జరుగుతుందని ఆయన చెప్పారు. తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రచురించడం జరుగుతుందని వివరించారు. అక్టోబరు 17 నుండి నవంబరు 30 వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అక్టోబరు 28,29 మరియు నవంబరు 18, 29 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 2023 అక్టోబరు 1నాటికి, 2024 జనవరి 1 నాటికి అర్హత కలిగి నమోదు చేసుకోని అభ్యర్థులను నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. బూత్ స్థాయి అధికారి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని, బిఎల్ఒతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు వెళ్లేందుకు రాజకీయ పార్టీలు అధీకత వ్యక్తులకు సంబంధించిన పత్రాలు ఈ నెల 21 లోగా అందించాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి ఓటరుగా అర్హత పొందే యువత నుండి కూడా దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ బాల మురళీకష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఒల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ విష్ణుచరణ్

ఉత్తమ ఆదర్శ పాఠశాలగా భద్రగిరి పిటిజి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉత్తమ ఆదర్శ పాఠశాలగా భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాల ఎంపికైంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ అధికారుల నుంచి సమాచారం అందింది. 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును ప్రిన్సిపల్ ఎన్.సుబ్రహ్మణ్యం అందుకోనున్నారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతతోపాటు మార్కుల్లో మంచి ప్రతిభను ఈ పాఠశాల విద్యార్థులు కనబరిచారు. మరోవైపు ఇక్కడ చదువుతున్న విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు రావడం, ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అన్ని కలిపి పాఠశాలను గుర్తించిన అధికారులు ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేశారు. తమ పాఠశాలకు ఉత్తమ అవార్డుకు ఎంపికవ్వడం పట్ల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొత్తగూడలో జామి సంతోష్‌కుమార్ అక్రమ పిడిఎస్ బియ్యాన్ని నిల్వ చేయగా విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. 2300 కేజీల బియ్యం 47 బస్తాలను స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై గోదాముకు తరలించారు. ఆయనతో పాటు సివిల్ సప్లై డిటి మధుసూదనరావు, విఆర్ఒ అలివేలు తదితరులు ఉన్నారు.

డిప్యూటీ సిఎంకు వినతిని అందజేస్తున్న ఆర్‌పిలు

ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి
డిప్యూటీ సిఎంకు వినతి

ప్రజాశక్తి -సాలూరు

మున్సిపాలిటీల్లో మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం వారు డిప్యూటీ సీఎం రాజన్నదొరకి వినతిపత్రం అందజేశారు. ఆర్పీల సంఘం గౌరవాధ్యక్షులు ఎన్వైనాయుడు ఆధ్వర్యాన సంఘం సభ్యులు రాజన్నదొరను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిబిఒహెచ్ఆర్ అమలు చేయాలని కోరారు. గ్రేడింగ్ విధానం రద్దు చేసి పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. చదువు, వయసు, జెండర్ పేరుతో వేధింపులు, తొలగింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సెల్ ఫోన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎన్.సుగణావతి, సహాయ కార్యదర్శి జి.అన్నపూర్ణ, సభ్యులు మహేశ్వరి,దేవి,హైమ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న చంద్రబాబు

త్వరలో కురుపాంలో అన్న కేంటీన్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గల ప్రధాన కూడలి వద్ద కొద్ది రోజుల్లో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఐదు రూపాయలకే భోజనాన్ని అందిస్తున్న అన్నా క్యాంటీన్‌ను వైసిపి ప్రభుత్వం వచ్చాక అర్థాంతంగా ఆపేసిందని, దీన్ని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంచడానికి త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు యుద్ధభేరి కార్యక్రమాన్ని విచ్చేసిన సందర్భంగా ఆయన చేతుల మీదగా కురుపాంలో అన్నా క్యాంటీన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ అన్నా క్యాంటీన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నులిపురుగుల మాత్రలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

1నుండి 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఏడాదికి ఒకసారి నులిపురుగుల మాత్రలను తప్పనిసరిగా వేయించాలని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి అభినవ్‌కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నీలకంఠాపురం పంచాయతీ ధర్మలక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో 30మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను వేయించారు. కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి పుష్పలత, హెల్త్ అసిస్టెంట్ రామారావు, జగన్నాథం పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, జెడ్‌పిటిసి, వైద్యాధికారులు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎంపిపి గుడివాడ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో హాస్పిటల్ అభివృద్ధికి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఎంత మొత్తాన్ని ఖర్చు చేయాలన్న విషయాలపై ఆలోచన చేశారు. ముఖ్యంగా హాస్పిటల్లో ఉండాల్సిన మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరం రూ.లక్షా70వేలు హాస్పిటల్ అభివృద్ధికి ఉపయోగించుకోవడానికి నిర్ణయించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎ.రవికుమార్, వైద్యాధికారులు ఎం.శివగాయత్రి, శశిధర్, స్థానిక సర్పంచ్ పోల సుజాత, ఎల్‌డిసి రోజా రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ మైదానంలో జరుగుతున్న ఆటల పోటీలు

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ సంస్థల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు సాగుతున్నాయి. విద్యాసంస్థల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంటే పండుగ వాతావరణమే. ఈ నేపథ్యంలో పాలకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సత్యప్రభ నేతృత్వంలో సిబ్బంది రమేష్, విజయగౌరి, లావణ్య, రమ్య తదితరుల పర్యవేక్షణలో విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. శుక్రవారం కళాశాల మైదానంలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా విద్యార్థినిలు పాల్గొన్నారు.

వీధుల్లోకి మురుగునీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి తెలుగు బాప్టిస్ట్ దేవాలయం సమీపంలో ఉన్న దళిత వీధిలోకి మురికి నీరు చేరింది. కాలువలు ఇరుతట్టుగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా వీధుల్లోకి మురుగునీరు చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైనుంచి ఒకేసారి వరద రావడంతో వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కిడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పిహెచ్‌సి పరిధిలో గల ఇరిడి పంచాయతీ కుక్కిడిలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను వైద్యులు డాక్టర్ రౌతు రవికుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాల తీవ్రత ఉంటుందని, కావున అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే మందులు ఇస్తారని అన్నారు. అనంతరం ఫీవర్ స్క్రీనింగ్, కాలువల్లో యాంటీ లార్వా ద్రవణాన్ని పిచికారీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు బి.లక్ష్మణరావు, ఎంఎల్ హెచ్‌పిలు స్వాతి, ఎఎన్ఎం దీపిక, ఆశా వర్కర్లు, సిహెచ్ డబ్ల్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దేశాభివృద్ధికి ఐకమత్యంతో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం అవుదామని స్థానిక ఎమ్మెల్యే ఆలజంగి జోగారావు అన్నారు. అజాధికా అమృత మహోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన "నా నేల - నా దేశం, "నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం"పంచప్రాణ ప్రతిజ్ఞ, కార్యక్రమంలో ఎమ్మెల్యే మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులతో కలిసి దేశం కోసం పోరాడిన త్యాగధనులను, వీరులను గుర్తు చేసుకుంటూ ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ప్రారంభించారు. మట్టి ప్రమిదలు వెలిగించి ఐకమత్యంతో అభివృద్ధి సాధిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలను నాటి "నా నేల - నా దేశం, "నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం" కార్యక్రమం ఈ నెలాఖరు వరకు జరుగుతుందని. వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ జవాన్‌ను సత్కరించారు.కార్యక్రమంలో చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్పర్సన్ గుణేష్, పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ రవికుమార్, కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్

భామిని- నా భూమి నా దేశం మండలం లోని బాలేరు, నల్లారాయిగూడ, తలడా, ఘనసర గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య వీరులను స్మరిస్తూ బాలేరు పంచాయతీలో ఏర్పాటు చేసిన అజాదిక అమృత్ స్మారక స్థూపంపై బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, ఎంపిడిఒ చంద్రరావు, ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, ఎపిఒ తులసీదాస్ పువ్వులు వేసి నివాళులు అర్పించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించేలా కృషి చేయాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి. రామయ్య కోరారు. ఆజాధికా అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని మండలంలోని పాతపనుకువలస, కిరప గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ కల్పనా కుమారి మాట్లాడుతూ నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా దేశభక్తిని పెంపొందించడం, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులను స్మరించుకోవడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో ఒక శిలాఫలకం, 75 మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యం, ఎపిఒ బాబురావు సాగర్, వైస్ ఎంపిపి కె.సరస్వతి, సర్పంచ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

సమస్యల పరిష్కారం కోరుతూ
17న కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాటిని అమలు చేయలేని కోరుతూ ఈనెల 17న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు భవన నిర్మాణ కార్మిసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, రాయిపల్లి రాము తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదట భవన నిర్మాణ కార్మికుల బతుకులు నాశనం చేసే ఇసుక విధానం తీసుకొచ్చారని విమర్శించారు. కరోనా సమయంలో భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థాకలితో ఇబ్బందులు పడ్డా ముఖ్యమంత్రి కనికరించలేదన్నారు. పైగా భవనిర్మాణ కార్మికుల సంక్షేమానికి రాజశేఖరరెడ్డి సంక్షేమ బోర్డును ప్రవేశపెడితే, ఆయన కొడుకైన జగన్మోహన్ రెడ్డి ఈ బోర్డును రద్దు చేయడం అత్యంత దారుణన్నారు. సంక్షేమ బోర్డు రద్దుతో భవన నిర్మాణ కార్మికులు అనేక సంక్షేమ పథకాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున సంక్షేమ బోర్డు పునరుద్ధరించి పిల్లలకు స్కాలర్‌షిప్, గుర్తింపు కార్డులు, పెండింగ్ క్లైములు, ఇన్సూరెన్స్, ఇఎస్ఐ వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాలో 15 మండలాలకు భవన నిర్మాణ కార్మికులంతా పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పైల సత్యనారాయణ, మజ్జితాడి శ్రీనివాసరావు, భోగు మల్లేశ్వరరావు, మరడాన రవికుమార్, పోల రాజు, నాగూరు సంజీవరావు, ఎ.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న భవననిర్మాణ కార్మికులు

రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వాకాడ

830మందికి కౌలుకార్డులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇప్పటి వరకూ 830మంది రైతులకు కౌలుకార్డులు జారీ అయ్యాయి, ఇంకా ఎవరైనా కౌలు రైతులుంటే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతు కార్డులు మాత్రమే రైతు భరోసా పథకానికి అర్హులని తెలియజేశారు. ఇప్పటివరకూ ఆర్‌బికెల ద్వారా ఎరువులు సరఫరా చేశామని, ఇంకా కావాల్సిన వారు ఆర్‌బికెను సంప్రదించాలన్నారు. మండలంలో నిర్మాణం జరుగుతున్న ఆర్‌బికెల స్థితి గతులను గూర్చి వివరించారు. ఇప్పటి వరకూ పిఎం కిసాన్ 85శాతం జరిగిందని, ఇంకా ఎవరైనా రైతులుంటే త్వరితగతిన ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. ఇ-పంట నమోదు ప్రక్రియ ఈ సంవత్సరం జియో కో-ఆర్డినేట్స్ ద్వారా జరుగుతుందని రైతులంతా ఈ విషయాన్ని గమనించి పండిస్తున్న పంటకు ఇ- పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే చెరువులు, ఆసైన్డ్ భూములు, డి- పట్టా, ఆర్ఒఎఫ్ఆర్ అన్ని భూములకు కూడా ఇ - పంట నమోదు జరుగుతుందని తెలిపారు. ఎపిసిఎన్ఎఫ్ వారు ప్రకృతి వ్యవసాయం గూర్చి తెలిపారన్నారు. మండల పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశుబీమా పథకం, పశుపోషణకు సంబంధించి మిశ్రమ దాణా గూర్చి, అలాగే యాంత్రీకరణకు సంబంధించి చాఫ్ కట్టర్స్ అందుబాటులో ఉన్నాయని, గొంతువాపు వ్యాధికి సంబంధించి పశువులకు టీకా వేయడం జరిగిందని తెలిపారు. ఎపిఎంఐపికి సంబంధించి 2.50 ఎకరాలు పల్లం,5.0 ఎకరాలు మెట్టు భూమిని ప్రాతిపదికగా పరిగణించి 55శాతం రా నల్లపైపులను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే శత శాతం రాయితీతో నవధాన్యాలు కిట్ ను రైతులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు ద్వారా పంపిణీ చేశారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పోల ఈశ్వర నారాయణ, ఎంపిడిఒ ప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీలు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అటవీభూమిలో గుడిసెలు వేసుకుంటాం

ప్రజాశక్తి - బెలగాం

ఇళ్ల స్థలాల్లేని గిరిజనులమంతా ప్రభుత్వ అటవీభూమిలో గుడెసెలను వేసుకుంటామని గుమ్మలక్షిమీపురం మండలంలో ఇళ్లులేని గిరిజనులు కోరారు. ఈ మేరకు ఈ మండల గిరిజనులు ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్‌కు గురువారం వినతిని అందజేశారు. అనంతరం గిరిజనులు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలో స్థలం లేని సుమారు 10పంచాయతీలు, 42 గ్రామాలకు చెందిన తమకు మండల కేంద్రంలో గల ఎపి రెసిడెన్షియల్ స్కూల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఫారెస్ట్ భూమిలో తుప్పలు, డొంకలు తొలగిస్తూ, గుడిసెలు వేసుకుంటున్న సందర్భంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు తమపై బైండోవర్ కేసులు, ఇతర సెక్షన్ల కింద కేసులు పెట్టి మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇళ్లు లేని గిరిజనులమంతా ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు వినతిని అందజేశామన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు తహశీల్దార్‌ను తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని చెప్పినా నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. విచారణల పేరిట కాలయాపన చేయడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఇళ్లు మంజూరు చేయాలని ఎపిఒకు గిరిజనులు వినతిని అందజేశారు.

చిట్టపూడి వలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలసలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయమి, ఎఎన్ఎం పైడితల్లి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా చూడాలి

ప్రజాశక్తి - బెలగాం

మండలంలోని గోచెక్క ప్రాంతం జియో సెల్ టవర్ సిగ్నల్ అంతరాయం లేకుండా చూడాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకరరావు, ఉర్లక నాగార్జున ప్రభుత్వాన్ని కోరారు. సిగ్నల్స్ లేక సంక్షేమ పథకాలు అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని డికె పట్నం సచివాలయ పరిధిలో గిరిజనులకు ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేనందున తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఉపాధి'లో వీరఘట్టం ఆదర్శం : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పనుల నిర్వహణలో మండలం ఆదర్శంగా నిలిచిందని, ఇందుకు ఇక్కడ అధికారుల కృషి ఎంతో అభినందనీయమని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొని ఆయన మాట్లాడారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేసిన వివిధ రకాల పనులకు సంబంధించి గత నెల 27 నుండి ఆగస్టు 10 వరకు సామాజిక తనిఖీలు పగడ్బందీగా నిర్వహించారని అన్నారు. అంతేకాకుండా ఆయా పంచాయతీల పరిధిలో గ్రామసభలు కూడా నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారన్నారు. ఎపిడి జి.శ్రీహరి మాట్లాడుతూ ఈ సామాజిక తనిఖీల్లో 12 మంది డిఆర్పీలు, ఇద్దరు ఎస్ఆర్పిలు పాల్గొన్నారన్నారు. మండలంలోని 810 పనులుగాను రూ.12 కోట్ల 54,96,513, వేతనాల రూపంలో రూ.4 కోట్ల 56,52,646, మెటీరియల్ రూపంలో రూ.17కోట్ల 11 లక్షల 49,159 విలువ గల పనులు జరిగినట్లు వెల్లడించారు. పంచాయతీల వారీగా నివేదికలు వివరిస్తూ వాటి లోటుపాట్లను సభ ముందు ఉంచడంతో చీకటి పట్టినప్పటికీ ఇంకా సమావేశం కొనసాగుతూనే ఉంది. ఈ పనుల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా తదితర వివరాలు తెలియాల్సి ఉంది. కార్యక్రమంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ జిజె ప్రసాద్, ఎఒ వై.వెంకటరమణ, విజిలెన్స్ ఆడిట్ అధికారి డి.సుదర్శన రావు, ఎస్ఆర్పిలు ఎం.తిరుపతిరావు, గోవిందరావు, ఎపిఒలు జి.సత్యంనాయుడు, కెవిల్ ప్రసాదరావు, డిఆర్‌పిలు, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణనాయుడు

పూరిపాకల్లో చదువులు ఇంకెన్నాళ్లు?

ప్రజాశక్తి - మక్కువ

ఇంకా పునాదుల్లోనే పాఠశాల నిర్మాణ పనులు

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెద్దవలసలో గిరిజన విద్యార్థుల చదువు గత ఏడేళ్లుగా పాకల్లో సాగుతున్నాయి. పాఠశాల పనులు నత్తనడకన సాగడంతో బడి సాలల్లోనే కొనసాగుతుంది. ఇటీవల గ్రామస్తులంతా చందాలు వసూలు చేసుకొని రేకులు షెడ్డు వేశారు. ఈ పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయినా పక్కా భవనం లేకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న జనసేన నాయకులు జి.రిషివర్ధన్ శుక్రవారం పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమాలతో పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకోవడం తప్ప ఆచరణలో ఎక్కడా పనులు జరగడంలేదన్నారు. చెట్ల కింద పాఠాలు చెప్పున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుం దన్నారు. పాఠశాల నిర్మాణానికి పునాదులు తీసినప్పటికీ పనులు ఏమాత్రం జరగడంలేదని, అక్కడ పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు, అక్కడ నివసిస్తున్న ప్రజలు వాపోతున్నారు. డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర పంచాయితీ అయి ఉండి కూడా ఈ గ్రామంలో కనీసం పాఠశాల లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే స్పందించి ఈ గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గిరిజనులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

టిడిపి అభ్యర్థి ఎవరైనా హ్యాట్రిక్ మాదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైనా హ్యాట్రిక్ కొడతామని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. శుక్రవారం చినమేరంగిలో తన అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం పై యుద్ధభేరి కార్యక్రమంలో చేసిన ఆరోపణలు ఆర్గనైజర్లు ఇచ్చిన తప్పుడు సమచారంతో డీఆర్‌ను తీయించామని, అలాగే భూమి టిడిపి కార్యకర్తదని, ప్రభుత్వ భూమి అని చెప్పినటువంటి ఈ రెండు కూడా తప్పుడు ఆరోపణలని అన్నారు. నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ చేయని విధంగా అభివృద్ధి పనులు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని, అవే మా గెలుపునకు శ్రీరామరక్ష అన్నారు. మా నాయుకుడు చేసిన సంక్షేమ కార్యక్రమాలే మా ధైర్యం నమ్మకంమని టిడిపి అభ్యర్థి ఎవరైనా వైసిపికి ఇక్కడ హ్యాట్రిక్ తప్పదని అన్నారు. 2019 లో వచ్చిన మెజార్టీ కన్నా ఇంకా ఎక్కువ మెజార్టీ సాధిస్తామని అన్నారు. విలేకరుల సమావేవంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి శెట్టి పద్మావతి, జియ్యమ్మ వలస జడ్పీటీసీ ఎం.శశికళ , వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జనం కోసం పోరాడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జనసేన నాయకులు జనం కోసం పోరాడాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. శుక్రవారం జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్‌తో ఆమె మాట్లాడుతూ జనసేన ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి ప్రజలకు అండగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా వారి వెంట నిలబడి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇందుకు గ్రామాల్లో, వార్డుల్లో విరివిగా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని అవి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని సమస్యలపై చర్చించారు. వాటి పట్ల వ్యవహరించాల్సిన తీరుపై దిశా నిర్దేశం చేశారు.

విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధతో ఉండి పాఠ్యాంశాలను బోధించాలని ఎంఇఒ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన ఎల్విన్ పేట మినీ స్టేడియం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు పట్టిని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను తల్లిదండ్రులు కూడా ప్రతిరోజు పరిశీలించి విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం పథకంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే ఉపాధ్యాయులకు తక్షణమే తెలియపరచాలని కోరారు. అలాగే ప్రతి రోజు విద్యార్థులకు యూనిఫామ్, షూస్, బెల్టు, బ్యాగ్‌తో పాటు పాఠశాలకు పంపించాలని తెలిపారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు కమాండో శోభన్ బాబు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కురుపాం

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన స్థానిక మేజర్ పంచాయతీలో గల శివన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం శివన్నపేటకు చెందిన నెలిపురి రమణ (45) అనారోగ్యంతో బాధపడుతూ కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను బంధువులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

300 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం గ్రామానికి చెందిన జంగరాపు అప్పారావు, సిరిపురపు చిన్న రాయుడు, బంగారపు కళ్యాణ్ బాబు శుక్రవారం అక్రమంగా 300 లీటర్ల నాటు సారాను ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు తూడి గ్రామ జంక్షన్ వద్ద పోలీసులు సోదాలు చేసి సారాను తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు చేయడంతో పాటు ఆటోను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది కూడా ఉన్నారు.

PARVATHIPURAM MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

S.No.	NIT No.	No. of works	Total Estimate Amount
1	Tender No.5/2023-24 (APURMSP/General Fund SFC Grant and 15th FC Grant)	3 Works	Rs.28.00 Lakhs
	Total	3 Works	Rs.28.00 Lakhs

For further details visit : For all details visit site
www.apeprocurement.gov.in

Sd/- J. Rama Appalanaidu
Commissioner
Parvathipuram Municipality

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 43 ANNIVERSARY 1981-2023

ప్రత్యేక అనుబంధం

పార్వతీపురం మన్యం జిల్లా

శనివారం 12-8-2023 | 20 పేజీలు

పార్వతీపురం మన్యం..

భిన్నజాతుల సమాహారం

- ఓవైపు అటవీ సంపద
- మరోవైపు సారవంతమైన భూములు
- నాగావళి, జంఝావతి, తోటపల్లి జలకళలు
- స్ఫూర్తి నింపే గిరిజన రైతాంగ పోరాట స్థలాలు
- గిరిజన సంతలే సూపర్ మార్కెట్లు
- సాలూరి, ఆదిభట్ల జన్మస్థలాలు
- అక్షరాస్యతలో అట్టడుగు స్థానం

6లో



ప్రతి అక్షరం... ప్రజల పక్షం

● ప్రజాశక్తి 43 ఏళ్ల ప్రస్థానం ● అంచలంచెలుగా అభివృద్ధి

అవి 1980 సంవత్సరపు చివరి రోజులు. అఖిలపక్ష రైతుఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉధ్రృత ఊపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదు. మరోవైపు పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమబెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యో దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చు యంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటివరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు.

ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు – దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి. నిజానికి ప్రజాశక్తికి అరవై ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్– ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రజాశక్తి ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతో గాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాల రీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్లపాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీల వాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ పత్రిక తొలిప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటిపేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పునఃప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ శతజయంతి ఉత్సవాలు వచ్చాయి. అ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొచ్చింది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా

ప్రజాశక్తి ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న పుచ్చలపల్లి సుందరయ్య;

శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చౌదరి తేజేశ్వరరావు

ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్‌నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషులైన కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు. ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదేండ్ల వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటినుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతీరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదేండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు' అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే ఆ నెలరోజులూ ప్రజాశక్తి ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీపడి విడుదల చేయడానికి కృషి పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజి కూడా మెరుగైంది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్దఫోటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయనైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేష కృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు సంపాదకీయం దానికి పెద్దపెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితబావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో దీటుగా అది ముందుకు సాగింది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫోటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పని చేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యాన్ని పంచిపెట్టింది. 1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది.

1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్ రామ్ బోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. బోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

మరో మలుపు

1990 ప్రజాశక్తిలో మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజినేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరిగైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజికీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. తర్వాతకాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. జయప్రదంగా నడిచింది. ఇది తెలుగులో వామపక్షపత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

ప్రజాశక్తి ప్రజా ఉద్యమాలతో, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 1997లో విశాఖ ఎడిషన్ రాష్ట్రంలో మూడో ఎడిషన్‌గా అవతరించింది. ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, శ్రీకాకుళం ఎడిషన్లు వచ్చాయి. ఇంతేకాక వందల సంఖ్యలో కంప్యూటర్ కేంద్రాలు వెలిశాయి. జిల్లా సబ్ సెంటర్లు ఏర్పడ్డాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, విస్తరించిన పునాది, మారిన ధృక్పథం ఇవన్నీ కలిసి ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి. ఫలితంగా దాని ప్రతిష్ట, ప్రజాదరణ పెరిగాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజాశక్తి కొనసాగుతోంది. తెలంగాణలో 2015 మార్చి 21 'నవ తెలంగాణా' పత్రికగా రూపాంతరం చెందింది. 2005 తరువాత రాష్ట్రంలోని వివిధ టాబ్లాయిడ్లు రంగుల్లోకి వచ్చాయి. మెయిన్ 8 నుంచి 10 పేజీలకు, 12 పేజీలకు పెరిగింది. పాఠకులను ఆకట్టుకోవడానికి 'జీవన' శీర్షికతో నాలుగు పేజీలు వచ్చాయి. ఇలా అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీని వాడుకొని ప్రజాశక్తి ముందుకుపోతోంది. పత్రిక అభిమానులు, శ్రేయోభిలాషులు ఉద్యమ బాధ్యతను ప్రత్యేక కాంపెయిన్లతో దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తూనే ఉన్నారు. అయితే ఇంతలోవచ్చిన కరోనా మహమ్మారి అనేక రంగాలపై తీవ్రప్రభావం చూపుతోంది. ప్రజాశక్తిపై కూడా ఆ ప్రభావం తీవ్రంగా పడింది. ఫలితంగా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా పేజీలను తగ్గించుకోవాల్సి వచ్చింది. జిల్లా వార్తలకు మెయిన్‌లో రెండు పేజీలు కేటాయించింది. ఉన్న పరిమితులతోనే నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవడానికి కృషి చేస్తూ ప్రజాశక్తి ప్రస్థానం సాగిస్తోంది. ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి ప్రతీకగా వెలుగొందుతోంది. ప్రతీ అక్షరం ప్రజల పక్షం అని చాటుతోంది. ●

వనరుల వినియోగంతో జిల్లా అభివృద్ధి

గ్రోత్ సెంటర్ ఏర్పాటుకు స్థలపరిశీలన • డిప్యూటీ సిఎం రాజన్నదొర

పార్వతీపురం మన్యం జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులతో అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లాలో వున్న వనరుల ద్వారా అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కేంద్రం నుంచి జిల్లాకి అవార్డు లభించిందని అన్నారు. వెనుక బడిన జిల్లా అయినప్పటికీ పదోతరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా పారిశ్రామిక అభివృద్ధి కోసం గ్రోత్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచన వుందన్నారు. పార్వతీపురం నియోజకవర్గం లేదా సాలూరు నియోజకవర్గంలో గ్రోత్ సెంటర్ ఏర్పాటుకు స్థలపరిశీలన జరుగుతోందని చెప్పారు. జిల్లాపై ప్రత్యేక దృష్టితో సిఎం జగన్ మోహన్ రెడ్డి వైద్య కళాశాలని కూడా మంజూరు చేశారని చెప్పారు. ఇప్పటికే కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల మంజూరయిందని తెలిపారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజాశక్తి- సాలూరు

మన్యం జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన అటవీశాఖ అనుమతులు కూడా లభించాయి. గడపగడపకూ మన ప్రభుత్వం కింద సచివాలయానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేసుకునేందుక వెసులుబాటు కల్పించాం. సాలూరు నియోజకవర్గ పరిధిలో 22 బిటి రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో 12రోడ్డు పనులు జరుగుతున్నాయి. జలజీవన్ మిషన్ కింద రూ.150కోట్లతో ఇంటింటికీ తాగునీటి సరఫరా కార్యక్రమం జరుగుతుంది. ఐటిడిఎలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల వాటా తగ్గడంతో గిరిజన ఉపాధికి సంబంధించిన పథకాలు తగ్గాయి. గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పడిన మొదటి సంస్థ జిసిసి రాష్ట్ర విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆర్థిక పరిపుష్టి వున్న అటవీ ఉత్పత్తుల దిగుబడి ఎక్కువగా వున్న ప్రాంతాలు తెలంగాణ రాష్ట్రానికి వెళ్లిపోవడంతో ఎపిలో జిసిసి కొంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. చాలా కాలంగా జిసిసిలో ఉద్యోగాల భర్తీ జరగలేదు. ఉన్న కొద్దిమంది ఉద్యోగులతోనే సంస్థ కొనసాగుతుంది. కాఫీ, మిరియాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఒకప్పుడు గిరిజనులు అడవులపై ఆధారపడి జీవించేవారు, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడా జీవనోపాధి మెరుగు పరుచుకుంటున్నారు. ఎపిలో అడవుల విస్తీర్ణం పెంచాల్సిన అవసరం వుంది. జిసిసిలో కారుణ్య నియామకాలకు సంబంధించిన ఫైలు సిఎం జగన్ మోహన్ రెడ్డి వద్ద పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే జిసిసి ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేశాం. కొటియా గ్రామాల వివాదం విషయంలో ఒడిశా అధికారులు ప్రజాప్రతినిధులు కొంత దూకుడు గా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంతో ఎపికి కొన్ని జల వివాదాలు వున్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని ఎపి ప్రభుత్వం సంయమనంతో వ్యవహరిస్తోంది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం కొటియా గ్రామాల పై ఒడిశా, ఆంధ్రాలకు అధికారం వుంటుంది. ఎప్పటిలాగే రెండు రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొటియా గ్రామాల ప్రజలు పొందవచ్చును. కొటియా గ్రామాల ప్రజలు ఆంధ్రాలోనే వుంటామని గతంలో లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాం. పరస్పర చర్చలతోనే కొటియా గ్రామాల వివాదం పరిష్కారమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశాం. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో 98శాతం అమలు చేశాం. రాష్ట్రంలో అంచెలంచెలుగా మధ్యనిషేధానికి ప్రభుత్వం కట్టుబడింది. సాలూరు నియోజకవర్గ పరిధిలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు భూసేకరణ పూర్తయింది. యూనివర్శిటీ ఏర్పాటుకు 560 ఎకరాల భూమి సేకరించాం. త్వరలో సిఎం జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ యూనివర్సిటీ శంకుస్థాపనకి రానున్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపిగా పోటీ చేయాలా ఎమ్మెల్యేగా పోటీ చేయాలనేది సిఎం జగన్ మోహన్ రెడ్డి నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. ఎంపిగా పోటీ చేయాలని నేను కోరుకుంటున్నాను. అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్.

జిల్లా అభివృద్ధికి ఉధృత పోరాటాలు

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి, రెడ్డి వేణు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో అనేక వనరులు ఉన్నాయని, వాటిని పాలకులు వినియోగంలోకి తెస్తే జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు అన్నారు. భూమి కోసం... భుక్తి కోసం పోరాడిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి కోసం ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సంచికకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

పార్వతీపురం మన్యం ప్రాంతం అనేక జీవనదులు, అటవీ ఉత్పత్తులు, పోడు భూములు ఉన్నాయి. భిన్న సంస్కృతి గల ప్రజలు జీవిస్తున్నారు. ఉన్న వనరులను వినియోగంలోకి తేవడంలోను, అభివృద్ధి చేయడంలోనూ నాటి నుంచి నేటి వరకు పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. పార్వతీపురం మన్యం కొత్త జిల్లా గా ఏర్పడిన ఏడాదిన్నర కావస్తున్నా అభివృద్ధికి ఒక్క అడుగు కూడా పడలేదు. దీనికి పాలకుల నిర్లక్ష్యమే కారణం. బడుగులు, ఆదివాసీ గిరిజనులు, దళిత, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వర్గాలకు కొంతైనా ప్రయోజనం జరిగిందంటే సిపిఎం, వామపక్షాలు నిర్వహించిన ప్రజా పోరాటాలే కారణం. ఇంకా ఈ ప్రాంతంలో అనేక సమస్యలున్నాయి. వాటన్నింటి పరిష్కారానికి పార్టీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టబోయే పోరాటాల్లో ప్రజలందరూ కలిసి రావాలని కోరుతున్నాం.

> “ తోటపల్లి, పెద్దగెడ్డ ప్రాజెక్టుల నిర్వాసితులకు నేటికీ పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించలేదు. తోటపల్లి కాలువ ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్నందున అన్ని మండలాల్లో ఎత్తిపోతల పథకాలు ద్వారా పిల్ల కాలువలకు నీరందిస్తామని పాలకపార్టీ నాయకుల మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి, ప్రతి ఎన్నికలలో హామీలతో ప్రచార్బాటాలు చెసి గద్దెనెక్కిన తరువాత గాలికి వదిలేస్తున్నారు . గుమ్మడి గడ్డ నిర్మాణానికి ప్రాజెక్టుకునిధులు కేటాయించామని చెబుతున్నా ప్రకటనలకే పరిమితమవుతున్నారు. ఈ ప్రాంత రైతులకు మేలు జరగాలంటే నిధులు కేటాయించి నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ”

పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజన్లు గా ఈప్రాంతం అభివృద్ధికి అపారమైన అవకాశాలు, నీటి వనరులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు పాలకులుగా ఉన్న కాంగ్రెసు, టిడిపి, వైసిపి నాయకులు చిత్తశుద్ధితో జిల్లా అభివృద్ధికి కృషి చేయలేదు.

> “ జిల్లాలో గిరిజన ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి పూర్తి స్థాయిలో పోడు పట్టాలు ఇవ్వడం లేదు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పదివేల మంది పోడు వ్యవసాయం చేస్తుంటే కొద్దిమందికే పట్టాలు ఇచ్చి మిగతా వారికి మొండిచేయి చూపుతున్నారు. అందరికీ పట్టాలు ఇవ్వాలని పోరాటాలు చేపడుతున్నాం. ”

జీవ నదులపై రిజర్వాయర్లను నిర్మించేందుకు పాలకులు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తే ప్రతీ పల్లె సస్యశ్యామలం అవుతుంది. సిపిఎం పార్టీ అనేక ప్రత్యామ్నాయ విధానాలను చూపించి పోరాటాలు చేపటినా పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది.

పార్వతీపురం ప్రాంతం కొమరాడ మండలంలో40 ఏళ్లుగా జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాలేదు. ఇది పూర్తయితే పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో వేలాది ఎకరాలకు నీరు అందుతుంది. కరువు కాటకాలు ఉండేవి కాదు. పూర్తయిన వెంగళరాయ సాగర్, పెద్ద గెడ్డ, వట్టి గెడ్డ, అడారు, పెద్దంకలాం, కొత్తవలస నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ఉన్నప్పటికీ కొన్నింటికి కాలువలు తవ్వక, మరికొన్ని కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించక మధ్యలో పనులు ఆగిపోయాయి. దీంతో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం వినియోగం జరగడం లేదు.

జిల్లాలో పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తామని జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పారు. ఆచరణలో ఉపాధి కల్పిస్తున్న జ్యూట్, చక్కెర మిల్లులను మూసివేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేసి యాజమాన్యాల పక్షాన నిలిచారు.

జిల్లా కేంద్రంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

పార్వతీపురం జిల్లా కేంద్రం అయినందున పట్టణ విస్తరణ వలన మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఇందుకు రూ.100 కోట్లు కేటాయించి ప్రణాళిక రూపొందించాలి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి. పట్టణంలో పూర్తిస్థాయిలో రోజూ తాగునీరు అందించాలి, కాలువలు నిర్మించి శానిటేషన్ సౌకర్యం మెరుగు చేయాలంటే విస్తరణకు తగినట్టు పారిశుధ్య కార్మికులను నియమించాలి. సాలూరు, పాలకొండ మున్సిపల్ పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

జిల్లాలో సుమారు 3 లక్షల మంది ఆదివాసీ గిరిజనులు ఉన్నారు. అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్నది. గిరిజన ఉత్పత్తులైన చింతపండు, జీడిమామిడి, ఇతర పండ్ల, అటవీ ఉత్పత్తుల కోసం ఈ ప్రాంతంలో ఆగ్రో బేస్డ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడితే గిరిజనులకు ఉపయోగ కరంగా ఉంటుంది. దళారుల నుంచి దోపిడీ తగ్గుతుంది. ఉత్పత్తులకు గిరాకీ పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమ మంత్రి ఉన్నందున ఆ దిశగా చర్లయు తీసుకోవాలి. గిరిశిఖర ప్రాంతవాసుల బతుకులు చాలా దయనీయంగా ఉన్నందున విద్య,వైద్యం, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

> “ సీతానగరం, మక్కువ, బలిజిపేట, సాలూరు, కొమరాడలో ఎక్కువగా చెరుకు సాగు చేసేవారు. ఎన్‌సిఎస్ యాజమాన్యం ఫాక్టరీని మూసివేయడంతో దీనిపై ఆధారపడిన రైతులు నష్టపోయారు. కార్మికులకు ఉపాధిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకొని నడిపిస్తే ఇటు రైతులకు, అటు కార్మికులకు జీవనోపాధి కలుగుతుంది. గత కొంతకాలంగా ఏజెన్సీలో తిరుగుతూ ఆస్తి, ప్రాణ నష్టం కలిగిస్తున్న ఏనుగుల గుంపును అటవీ ప్రాంతానికి తరలించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలి. ”

మైనింగ్ లీజులు రద్దుచేయాలి

మైనింగ్ మాఫియాలు కొండలు తవ్వుకునేందుకు కార్పొరేట్ కంపెనీలకు లీజుపేరుతో కొండల్ని కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా గిరిజనులతో కలిసి వీటిని అడ్డుకునే అనేక పోరాటాలు సిపిఎం చేపట్టింది. మైనింగ్ లీజులను రద్దు చేయాలని కోరుతోంది. గిరిజన ప్రాంతంలో రోడ్లు మౌలిక సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి ఇప్పటికీ సాలూరు పాచిపెంట మండలాల్లో డోలీ కట్టి వైద్యం కి దించాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రాథమిక ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు, మందులు పెంచాలి. ఏళ్లు గడుస్తున్నా పూర్ణ పాడు-లాబేసు వంతెన నేటికీ పూర్తి చేయలేదు. 16 పంచాయతీల ప్రజలు బాధలు వర్ణనాతీతం. గెలిచిన వెంటనే పూర్తి చేస్తానని పుష్ప శ్రీ వాణి ఎన్నికల్లో ప్రకటించారు, ఉప ముఖ్యమంత్రి పదవిచేపట్టినా ఆ ప్రాజెక్టును మాత్రం పూర్తి చేయలేదు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ట పరిచి పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరించాలి.. ఈ ప్రాంత అభివృద్ధికి అనేక పోరాటాలు చేస్తూ ప్రభుత్వానికి ఇప్పటికే పలు సూచనలు చేశాం.

ఉపాధి కరువు

టిడిపి నాయకులు శశిభూషణరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి నాలుగు న్నర ఏళ్ల పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలారని కురుపాం నియోజక వర్గం టిడిపి నాయకులు రౌతు శశి భూషణరావు అన్నారు. అధికారం లోకి రాగానే జాబ్ క్యాలెండర్ తీస్తామని ప్రకటనలు చేసిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ మాట మరిచారని అన్నారు. డిఎస్‌సి ఊసే లేదన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించడం లేదన్నారు. రోజు రోజు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అయినా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. ప్రజల కష్టాలు తీరాలంటే, భవిష్యత్తు కు గ్యారెంటీ కావా లంటే 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించ వలసిన బాధ్యత ప్రజలందరి పైన ఉందన్నారు.

శశిభూషణరావు

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాయగడ జమ్ము సర్పంచ్ పత్తిక అమల అన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఆశీర్వాదంతో సర్పంచ్‌గా గెలుపొందిన నాటి నుంచి నేటి వరకు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో తాగునీరు, విద్యుత్ దీపాలు, రేషన్ కార్డులు, పింఛన్లు అర్హులందరికీ మంజూరు చేశామన్నారు. మరోవైపు జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అర్హులందరికీ అందించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఈ సందర్భంగా తెలిపారు.

పార్వతీపురం మన్యం.. భిన్నజాతుల సమాహారం

విశాలమైన అటవీ ప్రాంతం, సారవంతమైన మైదానం, ఎత్తయిన కొండలు.. ఆ కొండలను సముద్రానికి తాకించే నదులు, అపారమైన అటవీ, ఖనిజ సంపద నూతనంగా రూపుదిద్దుకున్న ఈ జిల్లాలోని ప్రత్యేకతలు. గిరిజన, మైదాన ప్రాంతాల్లో భిన్నమైన జాతుల సంస్కృతి సంప్రదాయాలు కనిపిస్తాయి. ఎక్కువ భూభాగంలో అడవులు ఆవరించి ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచే గిరిజన రైతాంగ పోరాటం మొదలైంది. దీంతోపాటు సాలూరు జమిందారుల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం పీడిత ప్రజానీకానికి ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రముఖ సంగీత విధ్వాంసుడు సాలూరి రాజేశ్వరరావు, హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు వంటి ఎంతో మంది ప్రముఖులు ఈ జిల్లాకు చెందినవారే. ఈ జిల్లాలో ఎక్కువ మంది గిరిజనులు మాట్లాడే సవర భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు ప్రత్యేక లిపి తయారు చేశారు. ఇలా ఎన్నో వనరులు, మరెన్నో అవరోధాలతో ముడిపడివున్న ఈ ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడి సుమారు ఏడాదిన్నర కావస్తున్న నేపథ్యంలో అభివృద్ధి చెందుతుందని, చెందాలని ఈ ప్రాంతవాసులు ఆశపడుతున్నారు. కానీ, ఈ ఏడాదిన్నర కాలంలో అధికార యంత్రాంగం కొలువు దీరడం తప్ప సమస్యలు మాత్రం యథాతథంగానే కొనసాగుతున్నాయి.

తోటపల్లి బ్యారేజీ నుంచి నాగావళి నదిలోకి నీటి పరవళ్లు

పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒడిశా రాష్ట్రానికి ముఖద్వారంగావున్న ఈ గిరిజన ప్రాంతం అత్యంత వెనుకబడిపోయింది. ఇప్పటికీ వైద్య, వైద్యం, రహదారులు వంటి సదుపాయాలు తగినంతగా లేవు. విజయనగరం జిల్లా కేంద్రానికి అత్యంత దూరంలో వుండడం వల్ల ప్రభుత్వ ఫలాలు కూడా సరిగా అమలు కాని పరిస్థితి. విశాలమైన అటవీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనుల ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని సిపిఎం, ఎపి గిరిజన సంఘం చాలా కాలంగానే కోరుతూ వచ్చాయి. దీనికితోడు పాలకపార్టీల నాయకులు కూడా ఎన్నికల వేళ పార్వతీపురం డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ డిమాండ్లు తెరపైకి తెచ్చేవారు. మొత్తానికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని గిరిజన ప్రాంతాన్ని, దానికి అనుకునివున్న పలు మైదాన ప్రాంత మండలాలను కలిపి పార్వతీపురం మన్యం పేరిట గత ఏడాది ఏప్రిల్ 4న న ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైంది.

తూర్పుకనుమల్లో నైరుతి నుండి వాయువ్యానికి విస్తరించివున్న మన్యం జిల్లా భౌగోళికంగా రాష్ట్రంలోనే అత్యంత చిన్నది. మునుపు విజయనగరం జిల్లా పరిధిలోగల పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోకవర్గాలు, శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గం కలిసి మన్యం జిల్లాగా ఏర్పడింది. 3934 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ జిల్లాలో మొత్తం 15మండలాలు, రెండు డివిజన్ కేంద్రాలు, రెండు మున్సిపాల్టీలు ఉన్నాయి. జిల్లా మొత్తం 9.72లక్షల జనాభా ఉంది. 353 గ్రామ సచివాలయాలు, వాటి పరిధిలో 483 గ్రామ పంచాయతీలు, ఉన్నాయి. గిరిజన జనాభా 2.65లక్షలు (27.26శాతం), ఎస్సీ జనాభా 1.15 లక్షలు (11.83శాతం)గా ఉంది. మన్యం జిల్లా అక్షరాస్యతలో అత్యంత వెనుకబడి 50.9శాతంగా నమోదైంది.

గిరిజనుల ప్రత్యేక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలో ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. ప్రత్యేక జిల్లాగా ఏర్పాడినప్పటికీ గిరిజ ప్రాంతం, జనాభా, సమస్యలు యథాతథంగా ఉన్నందున ఈ రెండు ఐటిడిఎలను కొనసాగించాలని గిరిజనులు, వారి తరపున ఎపి గిరిజన సంఘం డిమాండ్ చేస్తోంది. గోస్తనీ, చంపావతి, వేగావతి, జంఝావతి, సువర్ణముఖి, నాగావళి నదులు మన్యం జిల్లాలో మీదుగానే ప్రవహిస్తాయి. ఏజెన్సీలోపాటు మైదాన ప్రాంతంలోనూ గిరిజనులు ఉన్నారు. ఏజెన్సీ, మైదాన ప్రాంత గిరిజనులు, మన్యంలోని వివిధ ప్రాంతాల భిన్న జాతులు, గిరిజనుల మధ్య సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణ, భాష, కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు జీవన విధానం, సామాజిక ఆర్థిక పరిస్థితులు తదితర అనేక విషయాల్లో కొన్ని ప్రత్యేకతలు, అంతరాలు ఉన్నాయి. ప్రధానంగా సవర, జాతాపు, గదబ, కొండదొర జాతులు ఉన్నాయి. ఎవరి సొంత భాషలు వారికున్నా అన్ని తెగలకు ఇంచుమించు తెలుగు భాష వచ్చు. సవరలు తెలుగు మాట్లాడటంలో ఇబ్బంది పడతారు. జాతాపులు 'కువి' భాష, సవరలు సవర భాష, గదబలు గదబ భాష, ఎరుకలు ఎరుకలి భాష మాట్లాడుతారు. ఒక సవర భాష తప్ప మిగిలిన భాషలకు లిపి లేదు. ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి పంతులు కృషి వల్ల సవర లిపి ఏర్పడింది. నిఘంటువులూ సమకూర్చారు. ఒడిశా సరిహద్దు ప్రాంతంలోనున్న గిరిజనులు ఒరియా భాష మిశ్రమంతో భాషలు మాట్లాడుతారు.

తోటపల్లి, జంఝావతి, వంశధార నదులు గిరిజన ప్రాంతంలో పంటల సాగుకు దోహదపడుతున్నాయి. ఇవే కాకుండా గుమ్మడిగెడ్డ, చిలకలగెడ్డ, అడారుగెడ్డ, రాళ్లగెడ్డ, వరహాలగెడ్డ వంటి 20 చిన్న చిన్న జీవ గెడ్డలు ఉన్నాయి. వీటిపై మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత సస్యశ్యామలం కానుంది.

మన్యం జిల్లా స్వరూపం

జిల్లా మొత్తం జనాభా	: 9.72 లక్షలు
గ్రామ పంచాయతీలు	: 483
గ్రామ సచివాలయాలు	: 353
మండలాలు	: 16
నియోజకవర్గాలు	: 4
గిరిజన జనాభా శాతం	: 2.65 లక్షలు (27.26శాతం)
ఎస్సీ జనాభా	: 1.15 లక్షలు (11.83శాతం)
జిల్లాలో మొత్తం స్త్రీలు	: 4.94 లక్షలు
పురుషులు	: 4.77 లక్షలు
అక్షరాస్యతాశాతం	: 50.9 శాతం
భౌగోళిక విస్తీర్ణం	: 3934 చదరపు కిలోమీటర్లు

పూర్వం జమిందారుల పాలనలో

క్రీస్తు శకం 16, 17 శతాబ్దాల నాటికి ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతమంతా ఒడిశా లోని జయపురం కేంద్రంగా పాలన ప్రారంభించిన నందాపూరు శిలావంశ రాజులు ఏలుబడిలోకి వెళ్ళింది. వారి పరిపాలనా సౌలభ్యం కోసం గిరిజన ప్రాంతంలో చిన్నచిన్న కొండ జమీందారులను ఏర్పాటు చేసి, వారి ప్రతినిధులుగా గిరిజను లనే జమీందారులుగా నియ మించి పాలన సాగించారు. వీరి నుంచి కప్పం కట్టించుకొనే వారు. అందులోభాగంగా ఏర్పాటైనవే ఆంధ్ర, పాచిపెంట, కురుపాం, సంగంవలస, సాలూరు, మేరంగి, పార్వతీపురం, మక్కువ, పాలకొండ జమీందారీ కోటలు.

ఉద్యమ స్ఫూర్తి.. మన్యం కీర్తి

- **దోపిడీకి వ్యతిరేకంగా అలుపెరుగని ఉద్యమాలు**
- **అశువులబాసి హక్కులు సాధించిన అమరవీరులెందరో**

నేటి మన్యం జిల్లా శ్రీకాకుళం గిరిజన రైతాంగం పోరాటానికి ఎంతో ఊపునిచ్చింది. భూమి కోసం... భుక్తి కోసం పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి దిక్కూ నినదించింది. 1960వ దశకంలో సాగిన ఈ ఉద్యమం పార్వతీపురం, సీతంపేట ప్రాంత ఏజెన్సీలో గిరిజన గూడేలంతటా విస్తరించింది. దోపిడీవర్గంపై ఇలా సాగిన ఉద్యమంపై కాల్పులు జరపడంతో ఈ ప్రాంతానికి చెందిన కోరన్న, మంగన్న అశువులు బాశారు. వీరి త్యాగాలకు ప్రతిరూపంగా ఏజెన్సీలో ఇప్పటికీ వారి స్థూపాలు దర్శనమిస్తాయి. కోరన్న, మంగన్న స్ఫూర్తితో వారి వర్ధంతి రోజు (అక్టోబర్ 31)న నాటి ఉద్యమ ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ స్థానిక గిరిజనులు ఇప్పటికీ నివాళులర్పిస్తున్నారు. దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన ఈ పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకం. పోరాట ఫలితంగా గిరిజనులు అడవితల్లిపై హక్కులు సాధించారు. ధరలో దగా తూకంలో మోసాలను ఛేదించుకున్నారు. గిరిజనుల్లో ఐక్యతకు ఈ ఉద్యమం నాందిపలకడంతో అనేక హక్కులు సాధించుకున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దున్నేవాడిదే భూమి... వెట్టిచాకిరీ నుంచి విముక్తి అనే నినాదంతో సీతంపేట, పార్వతీపురం ఏజెన్సీల్లో ఉవ్వెత్తున ఉద్యమాలు జరుగుతున్న రోజులవి. ఇప్పటి మాదిరి సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందకపోయినప్పటికీ గిరిజన గూడేల నుంచి తండోపతండాలుగా వచ్చి ఉద్యమంలో భాగస్వామయ్యారు. వీరందర్నీ మరింతగా ఉత్తేజపర్చేందుకు, దోపిడీవర్గాల కుట్రలను ఎదుర్కొనేందుకు 1967 అక్టోబర్ 31న కమ్యూనిస్టు పార్టీ మొండెంఖల్ గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు విద్యార్థులు, మహిళలు, గిరిజనులు పిల్లాపాపలతో వెళ్లారు. ఈ బహిరంగ సభను భగ్నం చేయాలని పలువురు భూస్వాములు పి.లేవిడి గ్రామం వద్ద ఆదివాసీలపై దాడులు చేశారు. ఆనాటి భూస్వాముల కాల్పుల్లో ఇద్దరు ఆదివాసి యువకులు మరణించారు. వారే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తొలి అమరవీరులు ఆరిక కోరన్న, కొండ గొర్రె మంగన్న. నేడు మన్యం జిల్లాలో పరిధిలోవున్న ఈ గిరిజన ప్రాంతమంతా నిన్నటి వరకు విజయనగరం జిల్లాలోనూ, అంతకు ముందు శ్రీకాకుళం జిల్లాలో పరిధిలోనూ ఉండేవి. ప్రస్తుతం ఈ ప్రాంతమంతా కలిపి ఒక జిల్లాగా ఏర్పడడంతో నాటి ఉద్యమ స్ఫూర్తిని పలువురు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో ఈ గిరిజన ప్రాంతంలోని అధిక శాతం భూమి జమీందారులు, సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆదివాసీలు రెక్కల కష్టంతో సాగుచేసిన వ్యవసాయ పంటలు, అడవుల్లో సేకరించిన అటవీ ఉత్పత్తులు తప్పుడు లెక్కలు, బెదిరింపులు, దౌర్జన్యాలతో లాక్కునేవారు. గిరిజనులకు అక్షర జ్ఞానం లేకపోవడం, కనీసం అంకెలు కూడా తెలియక పోవడంతో భూస్వాముల దోపిడీకి వరంగా మారింది. ఈ దోపిడినీ అరికట్టేందుకు,. గిరిజనులను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు చేసి ఉద్యమాలకు ఊపిరి పోశారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, నిర్మలమ్మ, సుబ్బారావు పాణిగ్రహి తదితరులు ముందుండి ఉద్యమాలను నడిపించారు. వీరితో సహా సుమారు 385మంది కార్యకర్తలు 1967లో అమరులయ్యారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, ఆయన భార్య సంపూర్ణమ్మ సహా వందలాది మందిని జైల్లోపెట్టారు. 1971 వరకు వివిధ దశల్లో ఉద్యమాలు జరిగాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోలీసు తూటాలకు బలైపోయారు. ఆరిక గుంపస్వామి, కొండగొర్రె లచ్చన్న, నిమ్మల కృష్ణమూర్తి, బిడ్డిక శ్రీరాములు, బిడ్డిక వసంత, పల్లెరుక రఘురాములు తదితరులు జైలు పాలయ్యారు. అయినా ఉద్యమాలు కొనసాగడంతో దోపిడీ తగ్గింది. సాలూరు ప్రాంత గిరిజనులు బ్రిటిష్‌వారి నిరంకుశ పాలనకు, దోపిడీకి విసిగి కీ.శ.1900 మే నెలలో 'కొర్రమల్లయ్య' కొండదొర నాయకత్వాన కొర్రవానివలస దగ్గర తిరుగుబాటు చేసినట్టు చరిత్ర చెబుతోంది. ఈ తిరుగుబాటు ఉద్యమంలో ఎంతోమంది అరెస్టయ్యారు. ఇందుకోసం పార్వతీపురం, సీతంపేట సహా పాడేరు, రంపచోడవరం కేంద్రంగా ఐటిడిఎ, జిసిసి ఏర్పాటయ్యాయి. అనంతరం కొనసాగిన పోరాటాల వల్ల గిరిజనులకు అడవిపై హక్కులు లభించాయి. కమ్యూనిస్టుల పోరాటంతోనే యుపిఎ -1లో అటవీ హక్కుల చట్టం లభించింది. ఇలా గిరిజనులు పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణతో పాటు గిరిశిఖర గ్రామాల్లో విద్య, వైద్యం, రహదారి సదుపాయాలు మెరుగుపడ్డాయి. అయినా, గిరిజన ప్రాంతం ఇప్పటికీ ఎన్నో సమస్యలతో సతమతమౌతోంది. జిసిసిని పాలకులే నిర్వీర్యం చేయడంతో అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావడం లేదు. నాటి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితే గిరిసీమలన్నీ ప్రగతి దారులే కానున్నాయి.

కోరన్న, మంగన్న స్థూపం

నిర్వీర్యమవుతున్న జిసిసి

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కరవు • దళారుల బారిన గిరిజనులు

ఆనాటి శ్రీకాకుళం రైతాంగ ఉద్యమ పోరాటం ఫలితంగా గిరిజనులకు ఉపాధి, సంక్షేమం, అభివృద్ధి అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన గిరిజన సహకార సంస్థ నేటి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం ఉదాసీన వైఖరికి కారణంగా నేడు నిర్వీర్యం అయిపోతోంది. ఆదివాసీలు సేకరించే అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉద్యానవన పంటలను కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో గుమ్మలక్ష్మీపురంలో మొదటిసారిగా 1969లో గిరిజన సహకార సంస్థను ఏర్పాటు చేశారు. దీని పరిధిలో డిఆర్ డిపోలు ఏర్పాటు చేసి గిరిజనులు పండించే అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేవారు. అయితే మొదట్లో జిసిసి లక్ష్యాలు నూటికి నూరు శాతం చేరుకొన్నా ఆ తర్వాత కాలక్రమేణా తగ్గుతూ వస్తున్నాయి. లక్ష్యం కొండంత... కొనుగోలు గోరంత అన్న చందంగా మారింది. ఏజెన్సీలో అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆదివాసీలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న జిసిసి లక్ష్యం నీరుగారుతోంది. ఆదివాసీల అభ్యున్నతికి సహకారం అందించాల్సిన జిసిసిలో వ్యాపార ధోరణి పెరిగిపోయింది. మరోవైపు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా పరోక్షంగా ప్రైవేటు వ్యాపారులకు మేలుచేస్తుంది. దీంతో గిరిజనులు దళారుల బారినపడి దోపిడీకి గురవుతున్నారు.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ వారపు సంతలో గిరిజనులు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, సాలూరులో జిసిసి బ్రాంచి కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 102 డిఆర్ డిపోలు నడుస్తున్నాయి. ప్రతి ఏటా గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులైన చింతపండు, చీపుర్లు, కొండ తామర, కరక్కాయలు, నల్లజీడి రాగులు, నరమామిడి చెక్క ఇలా 32 రకాలకు పైగా అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేసి గిరిజనులను ఆర్థికంగా ఆదుకొనేది. నాలుగేళ్ల నుంచి అటవీ ఉత్పత్తుల కొనుగోలు కనుమరుగవుతున్నాయి. ప్రతి ఏటా చింతపండు ఐదు వేల క్వింటాళ్లకు పైగా ఉత్పత్తి అయినప్పటికీ జిసిసి అధికారులు మాత్రం దీనిలో సగం కూడా కొనుగోలు చేయని పరిస్థితి. బయట వ్యాపారులెవరూ ఏజెన్సీలోకి రాకుండా ఉండేందుకు పలుచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అటువంటి చర్యలు ఎక్కడా కానరావడం లేదు.

గుమ్మలక్ష్మీపురం లో జిసిసి బ్రాంచి కార్యాలయం

వంగర, నీలకంఠాపురం, తాడికొండ, మొండెంఖల్, గుమ్మలక్ష్మీపురం, దుడ్డుఖల్లు, దేరువాడ, వలసబల్లేరు, గొరడ గ్రామాల్లో వారపు సంతలు జరుగుతుంటాయి. చుట్టుపక్కల కొండలపై గ్రామాల్లోని గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులు తెచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఇలాంటి చోట జిసిసి అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గిరిజనులకు కొంత ఆదాయంతో పాటు దళారుల బెడద తప్పుతోంది. ఆ దిశగా అధికారుల చర్యలు శూన్యం.

ఇతర వ్యాపారాల వైపు మొగ్గు

అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లను పక్కనపెట్టిన జిసిసి ఇతర వ్యాపారాల వైపునకు మొగ్గుచూపుతోంది. సూపర్ బజార్లు, గ్యాస్ అమ్మకాలు, పెట్రోల్ బంకు ఏర్పాటుతో లక్ష్యానికి మించిన వ్యాపారం చేస్తూ ఆర్థికంగా బలోపేతం చెందుతుంది. అటవీ ఉత్పత్తుల కొనుగోలులో మాత్రం లక్ష్యాన్ని చేరుకోవడంలో అంతగా శ్రద్ధ చూపడం లేదని గిరిజన సంఘ నాయకులు అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే జిసిసి ప్రాధాన్యత ఎందుకు ఇస్తుందో అర్థమవుతుంది.

శిథిలావస్థలో జిసిసి కార్యాలయం

గుమ్మలక్ష్మీపురంలోని జిసిసి కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 60 ఏళ్ల క్రితం నిర్మించిన భవనానికి మరమ్మతులు చేపట్టలేదు. వర్షం పడితే చాలు ఏ క్షణాన కూలుతుందోనని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది క్షణ క్షణం భయం భయంతో విధులు నిర్వహిస్తున్నారు. మేనేజర్ స్థాయి నుంచి అటెండర్ వరకు విధులు, ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తుంటారు. మరోవైపు కార్యాలయం చుట్టూ పొదలు ఏపుగా పెరగడంతో పాములకు ఆవాసంగా మారింది. ఎంతోమంది ఉన్నతాధికారులు ఈ ప్రాంత పర్యటనకు వస్తున్నా నూతన భవనం మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం కూలక ముందే నూతన భవనం ఏర్పాటుకు చేయాలని కోరుతున్నారు.

జిసిసిని బలోపేతం చేయాలి

గిరిజనులకు ఉపాధి, సంక్షేమార్థికాభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన గిరిజన సహకార సంస్థను బలోపేతం చేయాలి. జిసిసి కొనుగోళ్లతో ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. బయట మార్కెట్లో చింతపండు ధర కేజీ వంద ఉంటే జిసిసి మాత్రం రూ.40లోపు కొనుగోలు చేయడం విచారకరం. గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు స్పందించి కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

గిరిజనులు పండించి, సేకరించే 32 రకాల అటవీ ఉత్పత్తులకు జిసిసి ప్రాధాన్యత ఇచ్చి కొనుగోలు చేయాలి. జిసిసి మద్దతుధర ఇవ్వకుంటే గిరిజనులకు న్యాయం జరగదు. సంస్థ నిలబడాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి పూర్తిస్థాయిలో కొనాలి. గిరిజన యువతకు ఉపాధితోపాటు ఉత్పత్తులకు మద్దతుధర లభిస్తుంది.

- మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి

ప్రకృతి వనరులకు ఆలవాలం... మన్యం

• పోడు పంటలపైనే గిరిజనుల జీవనం
• కనుమరుగు అవుతున్న ఆచార వ్యవహారాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం అంటే...అందం, ఆహ్లాదం. పచ్చదనంతో నిండిన ప్రకృతి సౌందర్యం. పక్షుల కిలకిలలు, గల గల పారే సెలయేళ్లు.. ఆకాశాన్ని తాకుతూ కనిపించేలా ఎత్తయిన కొండలు. కోయిలమ్మ గానాలు.. నెమలమ్మ నాట్యాలు.. ఎటు చూసినా పచ్చదనంతో పర్యాటకుల మనసును పరవశింపజేసే ప్రకృతి అందాలకు ప్రతి రూపం.. అయితే ఇవి కేవలం బయటకు కనిపించే అందాలు మాత్రమే... మరోవైపు అందని విద్య, అందుబాటులో లేని వైద్యం, దొరకని మంచి నీరు, అభివృద్ధికి నోచుకోని రహదారులు, శిథిలమైన ఇళ్లు ఇన్ని అవస్థలు నడుమ గిరిజనం జీవనం. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా, ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది పాలకులు మారినా గిరిజనుల తల రాత మాత్రం మారలేదు. పాలకుల నిర్లక్ష్యం పుణ్యమా అని గిరిజనాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, పాచిపెంట, పార్వతీపురం, మెంటాడ, సాలూరు, సీతంపేట మండలాల్లో సవర, గదబ, కొండ దొర, జాతపు కులాల ఎక్కువగా గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఆదివాసీ తెగల జీవన విధానం చాలా ఆసక్తికరమైంది. సంస్కృతి సాంప్రదాయాలు విశిష్టమైనవి. సమాజంలో తరతరాలుగా వస్తున్న ప్రత్యేకమైన నమ్మకాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పండగలు, ఆటపాటలు, వృత్తులు, కళలు, సాహిత్యం వంటి అనేక విషయాల సమాహారాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలుగా పిలవచ్చు.

పోడు పంట జీవనాధారం

తరతరాలుగా కొండపోడు పంటలను నమ్ముకున్న గిరిజనులు అధికంగా చిరుధాన్యాల సాగు చేస్తుంటారు. కొర్రలు, జొన్నలు, కందులు, గంటెలు, ఊదలు, సామలు, రాగులు, జునుములు, ఉలవలు పంటలు పండిస్తుంటారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయడంతో మంచి గిరాకీ లభిస్తోంది. పోడు వ్యవసాయంతో పాటు చింత, జీడి పంటలపై కూడా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

వారపు సంతల్లో అమ్మకాలు..:

సీజనల్ వారీగా పండే అటవీ ఫలాలను అమ్ముకునేందుకు వారం వారం జరిగే గిరిజన వారపు సంతలకు గిరిజనులు పిల్లాపాపలతో వెళ్తుంటారు. చింతపండు, సీతాఫలం, మామిడి పండ్లు, కొండచీపుర్లు, పనసపళ్లు, నిమ్మకాయలు, బొగ్గులు, కర్రలు, అడవి దుంపలు, పువ్వులు వంటివి అమ్మకం చేసి వచ్చిన డబ్బులతో వారానికి సరిపడే నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వెళ్తుంటారు.

ఆహారపు అలవాట్లు...:

ఆదివాసీలు ప్రధానంగా దంపుడు బియ్యం, గంటెలు, కొర్రలు, రాగులు, టెంక పిండి, జీలుగు పిండితో జావ చేసుకొని తాగుతారు. వీటితో పాటు అటవీ ప్రాంతంలో లభించే పలు రకాల ఆకు, దుంప కూరలను ఆహారపు అలవాటు చేసుకుంటారు. వీటిలో ఆరికతెగలు, బోదంతం కూర, చేదుకూర, మునగకూర, వెదురు కొమ్ములు, ఆరిక దుంపలు, అడవి దొండ కాయలు, చిట్టికూర, పూలేరు గుడ్లను కూరగా వండుకుంటారు.

కట్నాలు లేని వివాహాలు....

ఆదివాసీ ప్రాంతాల్లో వివాహ ఆచారాలు వింతగా ఉంటాయి. ప్రస్తుత రోజుల్లో మైదాన ప్రాంతంలో వరకట్నం భూతం వెంటాడుతున్న ఆదివాసీ గ్రామాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా వరుడు కుటుంబ సభ్యులు వధువుకు ఓలి (తిరుగు కట్నం) ఖర్చుల నిమిత్తం ఇచ్చే ఆచారం ఉంది. ఇందులో కుల ఆచారానికి కొంత భాగం ఇవ్వాల్సి ఉండగా మిగతా కట్నం సొమ్మును వివాహానికి ఖర్చు చేస్తారు.

పండగల్లో ప్రత్యేకత.....

ఆదివాసీలు నిరంతర శ్రమ జీవులు.. వీరు తీరిక వేళల్లో ఆటపాటలు ఆనందోత్సవాలకు కొదవ ఉండదు. పండగలు, పబ్బాలు వస్తే గిరిజన గూడెంలో ప్రజలకు పట్టరాని సంతోషం. వీరు నిర్వహించే పండగలు అన్నింటిలోనూ ప్రకృతి ఆరాధన అంతర్లీనంగా ఉంటుంది. వ్యవసాయం, అటవీ ఫలసాయం సేకరణ, గ్రామ దేవతల పండుగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివాసీలు ముఖ్యంగా కందికొత్తలు, ఆగం పండుగ, కొండెం కొత్తలు, పిల్లి పండుగ, టెంక కొత్తల పండుగలను జరుపుకుంటారు. డప్పు వాయిద్యాలతో గ్రామాల్లోని గిరిజనులంతా ఒక్కటై నిర్వహిస్తుంటారు. పురుషులు డప్పు వాయిద్యాలు, తుడుము వాయిస్తుంటే మహిళలు లయబద్ధంగా నృత్యాలు చేస్తుంటారు. గిరిజన గ్రామాల్లో తరతరాల సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది.

ఆకట్టుకునే సంప్రదాయ నృత్యాలు....

గిరిజనుల పండగలు, శుభకార్యాల్లో ప్రదర్శించే నృత్యాలు ఆకట్టుకుంటాయి. థింసా, కందికొత్తల నృత్యాల్లో మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొంటారు. వెదురు కర్రలతో తయారు చేసిన తుడుము, మద్దిలి కిన్నెర గజ్జలు కిల్ల నాగర, తాళాలు వంటి వస్తువులు ఉపయోగిస్తారు.

అలంకరణకు ప్రాధాన్యత....

ఆదివాసీ గిరిజనులు పూర్వం నుంచి నేటి వరకు సంప్రదాయ వస్త్రధారణ, వస్తు అలంకరణకు ప్రాధాన్యత ఇస్తారు. ముక్కు, చెవులు, జుత్తుకు అలంకరణ వస్తువులు ధరిస్తారు. చెవి వాగులు, తమ్మెటలు, అనాగులు, ముక్కు చేసర్లు, దండ, కాళ్ల కడియాలు, మెడ, కాసుల హారం, చంపిన్నులు ఆభరణాలుగా వినియోగిస్తారు.

దరి చేరని పథకాలు... అభివృద్ధికి నోచని గ్రామాలు

ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్న గిరిజన గూడేలు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గిరిజన అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఐటిడిఎల్లో ప్రగతి అంతంతమాత్రమే. ఏళ్లు గడుస్తున్నా గిరిజన గ్రామాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు దరిచేరడం లేదు. నేటికీ చాలా గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి. ఏళ్ల తరబడి నమ్ముకొని సాగు చేస్తున్న పోడు భూములకు కూడా నేటి వరకు పట్టాలు పూర్తిస్థాయిలో అందని వారు ఇవ్వాలని కోరుతున్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి కృషి

ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖలో విద్యాభివృద్ధికి తమ సాయి శక్తుల కృషి జరుగుతుందని ఇంఛార్జి డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ అభివృద్ధికి ప్రాజెక్ట్ ఆఫీసర్ విష్ణు చరణ్ పర్యవేక్షణలో గిరిజన అభివృద్ధికి కృషి జరుగుతుంది. 420 విద్యాసంస్థల్లో 25,374 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు 47కు గాను బాలురు 32, బాలికలు 15 ఆశ్రమ పాఠశాలలు ఉండగా, ప్రైమరీ పాఠశాలలు (కో ఎడ్యుకేషన్) 350 వరకు ఉన్నాయి. గురుకుల పాఠశాల బాలురు 3, బాలికల ఒకటి, టీడబ్ల్యూయుఆర్‌జెసి 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకటుంది. గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలు 4 ఉండగా అందులో బాలురు 2, బాలికలు 2 కళాశాలలు నడుస్తున్నాయి. ఎస్ఒఇ/ సిఒఇ (బాలురు) 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకటి ఉంది. మినీ గురుకులం 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ఒక బాలికల పాఠశాల కూడా ఉంది. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు నాలుగు ఉన్నాయి. సొంత భవనాలు నిర్మాణం పూర్తి కావస్తుంది. ఇవి త్వరలో ప్రారంభం కూడా కానున్నాయి. కళాశాల వసతి గృహాలు ఎనిమిదింటికి బాలురు నాలుగు, బాలికల నాలుగు వసతి గృహాలు ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. జగనన్న విద్యాదీవెనలో రూ.1.92కోట్లు, జగనన్న వసతి దీవెనలో రూ.2.66 కోట్లు, అమ్మఒడి కింద రూ.35.47కోట్లు గిరిజన విద్యార్థినీ విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థిక తోడ్పాటు ప్రభుత్వం నుండి లబ్ధి చేకూరింది.

అత్యుత్తమ ఫలితాలు సాధించాం

గిరిజన సంక్షేమ విద్యా శాఖలో 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు 2,273 మంది పరీక్షలు రాయగా 2,134 మంది ఉత్తీర్ణలై 93.88శాతం అత్యుత్తమ ఫలితాలను జిల్లా, రాష్ట్రంలోనూ ప్రథమ స్థానం గుర్తింపును పొందాం. రానున్న ఏడాది కూడా శత శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలను తయారుచేసి విద్యా బోధనలు అందిస్తున్నాం. నాడు నేడులో ఫేజ్-1 రూ.16.14కోట్లుతో 48 ఆశ్రమ పాఠశాలలు, 5 ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలు, మొత్తం 53 స్కూల్స్‌ను, ఫేజ్-2లో 11 ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలు, 2 ఆశ్రమ పాఠశాలలు, ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను రూ. 4.60కోట్లతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యుత్తు, మరుగుదొడ్లు, తరగతి గదులను ఆధునీ కరించి విద్యార్థులకు మౌలిక సౌకర్యా లను కల్పిస్తూ సుందరీ కరణ చేస్తున్నాం.

ఈ ఏడాది 1216 ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కాగా 760 మంది ఉపాధ్యాయులను, 330 మంది సిఆర్‌టిలకు నియామకాలు చేపట్టాం. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మెనూ చార్ట్ అమలకు పక్కాగా జరిగేలా ఆదేశాలు ఇస్తూ పర్యవేక్షణ చేస్తున్నాం. పిల్లలు మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా మొదట విడత స్ప్రే పూర్తి చేయడమే కాకుండా, రెండవ విడత స్ప్రే చేయడానికి మలేరియా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పర్యావరణ పరిరక్షణలో పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

పార్వతీపురం మన్యంలో బాలసాహిత్య వికాసం

బెలగాం భీమేశ్వరరవు బెహరా ఉమామహేశ్వరరావు బివి పట్నాయక్

పార్వతీపురం మన్యం జిల్లా... సంగీత, సాహిత్య, కళా రంగాలకు చెందిన ఎందరో .మహానుభావులకు జన్మ నిచ్చింది. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు, ఆచంట సాంఖ్యాయన శర్మ, నడిమింటి సంగమేశ్వర శాస్త్రి , అనంత పంతుల రామలింగ స్వామి , ఎస్.వి.జోగారావు లాంటి సాహితీవేత్తలు, భూషణం మాష్టారు, పంతులజోగారావు, పి.వి.బి.శ్రీరామమూర్తి, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, తనికెళ్ళ కల్యాణి వంటి కథకులు, సాలూరు రాజేశ్వరరావు వంటి సంగీత ప్రముఖులు, వంగపండు ప్రసాదరావు, కుమ్మరి మాష్టారు, రౌతు వాసుదేవరావు వంటి జానపద కళాకారులు ఎంతో ఖ్యాతి తెచ్చారు. జిల్లా వాసులైన ఇద్దరు బాలసాహితీవేత్తలకు వరుసగా రెండేళ్ళ కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం వరించింది. వారే నారంశెట్టి ఉమామహేశ్వరరావు (ఆనందలోకం - నవల- 2018), బెలగాం భీమేశ్వరరావు (తాత మాట - వరాల మూట - బాల కథా సంపుటి- 2019). ఈ రంగంలో గర్వించదగ్గ రచయితలతో తలెత్తుకుని నిలిచింది. దాదాపు అరవై డబ్బై ఏళ్ల కిందటే ఇక్కడ బాల సాహిత్య సృజన ప్రారంభమైంది. 1957వ సంవత్సరంలో తాళ్ళపూడి వెంకటరమణ 'గుజ్జన గూళ్ళు' గేయ సంకలనాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. సుమారు అర్థ శతాబ్దం పాటు వీరి రచనలు తెలుగు బాల బాలికలను అలరించాయి. రాళ్ళపల్లి గౌరీపతి శాస్త్రి (లతిక), కొంత కాలం పాటు ప్రజామత, విశాలాంధ్ర పత్రికల్లోని బాలల శీర్షికల లోనూ, అనేక బాలల పత్రికలలోనూ గేయ, కథా సాహిత్యాన్ని అందించి బాల సాహిత్య సేవ చేసారు. 'చిన్నారి లోకం' బాల గేయ సంపుటిని అందించారు.

నేటి బాల సాహిత్య కారుల కృషి

1970 దశకంలో ప్రారంభించి నేటికీ బాలసాహిత్యంలో విరివిగా రచనలు చేస్తూ విశేష కృషి చేస్తున్న వారిలో పార్వతీపురానికి చెందిన బెలగాం భీమేశ్వరావు, నారంశెట్టి ఉమామహేశ్వరావు, బెహరా ఉమామహేశ్వరరావు, బివి పట్నాయక్, కిలపర్తి దాలినాయుడు, తుంబలి శివాజీ ముఖ్యులు. డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు సాహితీలహరి సాహిత్య సంస్థను స్థాపించి గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేవ చేస్తున్నారు. పిల్లల కోసం 'అందాల లోయ' నవలను హిందీ నుంచి తెలుగుకి అనువదించారు. కొన్ని బాలల కథలను బాలభారతం, బాలబాట పత్రికలో రాశారు. వీరి ఇంటిని బాలసాహిత్య గ్రంథాలయానికి కేటాయించి బాలసాహిత్య నిలయంగా మార్చారు. అందులో అనేక పుస్తకాలను భద్రపరిచినందున పరిశోధకులకు, జిజ్ఞాస ఉన్న పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. డాక్టర్ డి.పారినాయుడు సామాజికవేత్త, సంఘసేవకులు మాత్రమే కాకుండా రచయిత, బాలసాహిత్య ప్రోత్సాహకులు. వీరు త్రిమూర్తులు, దేశభక్తులు అనే పుస్తకాలు రాశారు. వ్యవసాయాన్ని పిల్లల దరికి చేర్చేందుకు 'బడి నుండి పొలం బడికి'పేరుతో వ్యవసాయ వాచకాలను రాయించి రంగుల్లో ముద్రించారు. 'భలే విత్తనాలు' పేరుతో పిల్లలు రాసిన బాల సాహిత్య పుస్తకాన్ని ముద్రించారు. తోటపల్లిలో బాల సాహిత్య గ్రంథాలయాన్ని స్థాపించారు. పార్వతీపురానికి చెందిన రచయితల బాల సాహిత్య పుస్తకాలను ముద్రించారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు 06. 07. 1952 నాడు జన్మించారు. వీరి ' తాత మాట వరాల మూట' కథా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం 2019 లో పొందింది. 1979 మార్చి మొదటి పక్ష పత్రిక 'శుభోదయ' లో 'చిలుక' గేయం వీరి తొలి రచన. కథ, గేయం, నవల, నాటిక, జీవితచరిత్ర,గేయకత, పద్యాలు , వ్యాసాలు, మొదలైన విభాగాల్లో 1200కు పైగా రచనలు పత్రికలలో రాసారు. 31 పుస్తకాలు ముద్రించబడ్డాయి. బాలసాహితీ భూషణ్, బాలప్రియ, 'తెలుగు భాషా భూషణ్', 'వేగావతి భారతి' బిరుదులు పొందారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం సహా 18 పురస్కారాలు పొందారు. మహారాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఏడు రచనలను వివిధ తరగతుల పాఠ్యాంశాలుగా తీసుకుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కథలపై ఒకరు, గేయాల పై ఒకరు పరిశోధన చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు 14. 11. 1964న గెడ్డలుప్పిలో జన్మించారు. 1980 లో బాలజ్యోతిలో రాసిన 'మేలెరిగిన మనిషి' అనుబంధ నవల వీరి తొలి

డి.పారినాయుడు

రచన. వీరి 'ఆనందలోకం' నవలకు జిల్లాలోనే మొదటిసారి 2018లో కేంద్ర సాహిత్య పురస్కారం వచ్చింది. వీరి కథలు, గేయాలు, గేయ కథలు, జోక్స్, కార్టూన్స్, కవితలు, వ్యాసాలు, పెద్దల కథలు, నవలలు 1500 కి పైగా అన్ని తెలుగు పత్రికలలో ప్రచురించబడ్డాయి. వీరి ' ఈకాలం పిల్లాడు' నవల విశాఖ సంస్కృతి మాసపత్రికలో సీరియల్ గా ఆదరణ పొందింది. 'బాల సాహితీ రత్న', 'బాలసాహితీ భూషణ్', 'బాలబంధువు', 'బాలనేస్తం' , 'వేగావతి భారతి' మొదలగు బిరుదులను పొందారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ తెలుగు భాషా సేవా విశిష్ట పురస్కారం, తెలుగు విశ్వ విద్యాలయం సాహితీ ప్రతిభా పురస్కారం సహా యాభైకి పైగా పురస్కారాలు పొందారు. వీరి రచనల్లో 22 వివిధ పోటీలలో బహుమతులు గెలుచుకున్నాయి. వీరి 'మేలెరిగిన మనిషి' కథా సంపుటి మొదలు "తప్పెవరిది" కథా సంపుటి వరకు 31 పుస్తకాలు ముద్రణ పొందాయి. వీరి రచనలపై పరిశోధనలకు ముగ్గురికి ఎం. ఫిల్, ఒకరికి ఆంధ్రా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రదానం చేయబడ్డాయి. గత ప్రభుత్వంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ సభ్యునిగా పనిచేసారు. బెహరా ఉమామహేశ్వరరావు 1979 నుండి బాలసాహిత్య రచనలు చేస్తూ 700 వరకు గేయాలు, గేయ కథలు, కవితలు, పద్యాలు, కథలు, నవలలు రాసారు. వీరి ప్రతిభను గుర్తించి నారంశెట్టి బాల సాహిత్య పీఠం పురస్కారం , బొబ్బిలి విజ్ఞాన వివర్ధనీ పరిషత్తు వారి బాల సాహిత్య పురస్కారం , తెలుగు రక్షణ వేదిక నుండి తెలుగు భాషా శ్రీ, వాసాల నరసయ్య పురస్కారం, హైదరాబాదు నుండి బాలగోకులం వారి బాల నేస్తం పురస్కారం, చెన్నై నుండి తెలుగు వెలుగు సంస్థ వారి పురస్కారం మొదలైనవి అనేకం పొందారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా సన్మానం పొందారు. వీరు రచించిన 'బడి గంటలు', 'యోగి వేమన', 'భక్త కబీరు' తో సహా ఇరవై పుస్తకాలు ముద్రించబడ్డాయి. బాలసాహితీవేత్త బి.వి.పట్నాయక్ రాసిన కథలలో ఎక్కువ కథలు ఈనాడు హాయ్ బుజ్జీలో ప్రచురితమవడంతో పలువురి మన్ననలు పొందారు. వీరి రచనల్లో 'డబ్బు కాసే చెట్లు', 'నిజమైన తీర్పు', 'పిల్లవాడి తెలివి', 'ఆర్భాటంతోఅగచాట్లు' ,'మూడో నేత్రం' , 'విచిత్ర శిక్ష- భూమికి రక్ష,' 'రాజుగారి ఏడు గదులు' మొదలైన కథలకు బహుమతులను బాలజ్యోతి, బాలబాట , శ్రీవాణి పలుకు, మంచిపల్లి ట్రస్ట్ , విశాఖ సంస్కృతి , నారంశెట్టి బాల సాహిత్య పీఠం సంస్థల నుండి పొందారు. వీరి రచనలు 9 పుస్తకాలు వచ్చాయి. వీరి రచనలపై పరిశోధనకు గాను ఒకరికి ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానంచేసింది.

బాల సాహితీవేత్తలకు పురస్కారాలు

సాహితీలహరి అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు... ఆయన సతీమణి మంచిపల్లి సత్యవతి పేరిట జాతీయ బాల సాహిత్య పురస్కారాన్ని స్థాపించి గత పదమూడేళ్లుగా ప్రసిద్ధులైన బాల సాహితీవేత్తలకు ప్రదానం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర రచయితల వేదిక అధ్యక్షులైన నారంశెట్టి ఉమామహేశ్వరరావు 'నారంశెట్టి బాల సాహిత్య పీఠం'ను స్థాపించి 2017 నుండి ప్రసిద్ధులైన బాల సాహితీవేత్తలకు ప్రతి ఏటా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబరు 14 నాడు పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. రచయితలకు పోటీలు పెట్టి, నగదు బహుమతులిచ్చి ప్రోత్సహిస్తున్నారు. బాలసాహిత్య అభివృద్ధికి తగినంత తోడ్పాటు అందిస్తున్నాయి.

బాల సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా అందించాలనే దృక్పథం గల తుంబలి శివాజీ గెడ్డతిరువాడలో జన్మించారు. చిత్రకారుడిగా, సినీ గీత రచయితగా సుప్రసిద్ధులు. పద్య గేయ వచన రచనల్లో మేటి. బాలల కోసం ఎన్నో కథలు, కామిక్ లు కార్టూన్లు, సందేశాత్మక చిత్రాలు, గేయాలు, గేయ కథలు అందించారు. వీరి 'ఆదర్శ బాల్యం' పుస్తకంలోని కథను మహారాష్ట్ర ప్రభుత్వం నాలుగో తరగతికి పాఠ్యాంశంగా చేర్చింది. 'బాల సాహిత్యంలో హాస్య కథలు', 'పిల్లా పీచు' కథా సంకలనాలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయి. పిల్లల కోసం యానిమేషన్ కథలు, సినిమాలు రూపొందించే పనిలో ఉన్నారు. పెరుగుతున్న సాంకేతికత, మారుతున్న సంస్కృతి విలువలను అనుసరించి బాల సాహిత్యం మార్పు చెందాలని, అభివృద్ధి కావాలని వీరి ఆకాంక్ష. ఎన్నో సంస్థల సన్మానాలూ, పురస్కారాలు అందుకున్నారు. 'చిత్రకళానిధి' వీరి బిరుదు. బాల సాహితీవేత్త రాగోలు శంకరరావు తేదీ 25. 07. 1966 న జన్మించారు. చిన్ననాటి నుండి రచనలు చేస్తున్నారు. కానీ బాలసాహిత్యం, హాస్య రచయితగా మంచి పేరొచ్చింది. వీరు మూడు వందల వరకు గేయాలు, కథలు, నవలలు వ్రాసారు. 'చైతన్య వాహిని' కలం పేరుతో మరి కొన్ని రచనలు చేసారు. ఇంతవరకు 8 పుస్తకాలు వెలువడ్డాయి. ఢిల్లీ తెలుగు అకాడమీ వారి బాల సాహిత్య పురస్కారాన్ని డా. సినారె చేతుల మీదుగా అందుకున్నారు. కిలపర్తి దాలినాయుడు కొత్తరేగలో 3.02. 1964లో జన్మించారు. వృత్తి ఉపాధ్యాయుడు. ప్రవత్తి రచయిత, కవి, కార్టూనిస్ట్. 1000కి పైగా కవితలు, గేయాలు, 500 కార్టూన్లు , 100 వ్యాసాలు , కథలు, వందకి పైగా పుస్తక సమీక్షలు రాసారు. వీరివి 9 పుస్తకాలు ప్రచురించబడ్డాయి. యాదగిరి గుట్ట కవితా నీరాజనం, ఎక్స్ రే (విజయవాడ) ఉత్తమ కవిత, శ్రీశ్రీ కవితా పోటీ సిరిసిల్లా , నేటి నిజం దినపత్రిక రాష్ట్ర స్థాయి వచన కవిత, సాహితీకిరణం(హైదరాబాదు), విజయభావన (విజయనగరం) సంస్థల నుండి బహుమతులు పొందారు. నారంశెట్టి బాలసాహిత్య పీఠం, రావి రంగారావు కళాపీఠం, కళామిత్ర - ఒంగోలు మొదలైన ఎన్నో పురస్కారాలు పొందారు. సాలూరు సాహితీ మిత్ర బృందానికి కార్యదర్శిగా , తెలుగు వెలుగు సంస్థకు గౌరవ సలహాదారుగా సేవలు అందిస్తున్నారు. సాంఘిక రచనలతో బాటు బాల సాహిత్యం సృజించారు చింతా అప్పలనాయుడు. విశ్రాంత ఉపాధ్యాయడైన వీరి 'బడి పాటలు', 'ఇల మీద దేవత' , 'రారండి మన వూరి బడికి' మొదలగు బాలగేయాలు పుస్తకరూపంలో వెలువడ్డాయి. వీరికి బాలసాహిత్యం అంటే ఇష్టం వలన పత్రికల్లో వచ్చిన ప్రతి గేయం చదువుతారు.చింతా దీక్షితులు నుండి నారంశెట్టి వరకు అందరూ అభిమానులేనని, అందరూ తనని ఆనందలోకాల్లో విహరింపజేస్తున్నవారేనని చెబుతారు. బాల సాహిత్య ప్రపంచంలో నారంశెట్టి ఉమామహేశ్వరరావు ప్రోత్సాహం వుందని చెప్పారు. పల్ల పరిశినాయుడు గరుగుబిల్లి మండలం నాగూరు లో జన్మించారు. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన వీరు చిత్ర, నఖ చిత్ర, వ్యంగ్య చిత్రాలు గీయడం, రచనలు చేయడం ప్రవత్తిగా కొనసాగించారు. పిల్లల కోసం వందకు

కిలపర్తి దాలినాయుడు మంచిపల్లి శ్రీరాములు గెంబలి శివాజీ

పైగా గేయాలను ఉపాధ్యాయ, ఈనాడు, సాక్షి, ఆంధ్రప్రభ, బాలబాట, భక్తిసమాచారం మొదలగు పత్రికలలో వ్రాసారు. వీరు వ్రాసిన నఖచిత్రరేఖ, పూలరేకులు , బాలల కోసం బొమ్మల శతకం పుస్తకాలు ముద్రించబడ్డాయి. రాజీవ్ గాంధీ ఎక్స్ లెంట్ అవార్డు, తెలుగు యూనివర్సిటీ పురస్కారం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం మొదలైన పురస్కరాలను పొందారు. బెలగాం కేశవరావు విశ్రాంత ఉపాధ్యాయుడు. వీరు బాలల కోసం గేయాలు, కథలు వ్రాసారు. వీరి 'శంకరం తెలివి' కథకు హైదరాబాదుకు చెందిన జాతీయ సంస్థ 'రూం టు రీడ్ ' మూడవ బహుమతి ఇచ్చి గౌరవించింది. ఈయన రాసిన కథలు రెండు పుస్తకాలుగా వెలువడ్డాయి. గుడ్ల అమ్మాజీ ఉపాధ్యాయిని, రచయిత్రి. పిల్లలకోసం వందకు పైగా గేయాలు, కథలు రాశారు. వీరి రచనలు బాలభారతం, బాలమిత్ర, బాలజ్యోతి, స్వప్న, నది , అల , విశాఖ సంస్కృతి, సాహో మొదలైన పత్రికలలో ప్రచురణ పొందాయి. వీరి గేయాలను 'బడిపిల్లలు' పుస్తకంగా ముద్రించారు.

లయన్స్‌క్లబ్ పార్వతీపురం, స్వామి సేవా సమితి , తెలుగు రక్షణ వేదిక, సాహితీలహరి మొదలైన సంస్థల నుండి సన్మానాలు పొందారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు. రావిపల్లి వాసుదేవరావు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి బాలసాహిత్య సృజన. ముఖ్యంగా బాలగేయాలు రాయడం చాలా ఇష్టం. 2021లో "వెన్నెలవాన" బాలగేయ సంపుటిని ముద్రించారు. ఇప్పటివరకు రెండు వందల బాలగేయాలు, 25 బాలల కథలు రాశారు. 2020లో రచనా సమాఖ్య, బొబ్బిలి వారిచే ఉగాది పురస్కారం, 2021లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, పార్వతీపురం లయన్స్ వారి నుండి పొందారు. వీరి స్వగ్రామం గరుగుబిల్లి మండలం శివ్వాం. నాగిరెడ్డి గౌతమి ఉపాధ్యాయిని మరియు బాలసాహిత్య రచయిత్రి . ఈమె పిల్లలకోసం ఇరవైకి పైగా కథలు రాశారు. వీరి రచనలు బాలభారతం, తెలుగువెలుగు మొదలైన పత్రికలు ప్రచురణ పొందాయి. పాచిపెంటకు చెందిన పి.వి.ఎస్.పాత్రో చాలా బాలసాహిత్య రచనలు చేసారు. వీరు రచించిన 'చీపురుకట్ట' శతకం ప్రసిద్ధి కెక్కింది. శిష్టా హరగోపాలరావు పిల్లల కోసం 'బాల గేయ దీపిక' గేయ సంపుటిని ప్రచురించారు. నవ్యపత్రిక సంపాదకు డు ఎఎన్.జగన్నాధ శర్మ బాలసాహిత్యం రాశారు. అరణి, శివ సతీపురం శర్మ, కంతు మొదలగు కలంపేర్లతో సాహిత్యం సృజించారు. పాలపిట్ట, మహాభారతం పుస్తకాలు జగన్నాధ శర్మను బాల సాహితీ వేత్తగా నిలబెట్టాయి. ఇంకా రెడ్డి పద్మావతి , బివిరవికృష్ణ, కోరాడ నరసింహారావు, కాలెపు శంకరరావు, వంజరాపు శేషు, బూరగాన దుర్గాప్రసాదు బాలల కోసం రచనలు చేస్తున్నారు.

ముక్తాయింపు

'పూసిన పూవులన్నీ దండలై దేవుడి మెడను అలకరించినప్పుడే అందం. రాసిన బాల సాహిత్యమంతా పిల్లలకు చేరినప్పుడే ఆనందం'. అందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో సహకారం అందించాలి. బడి పిల్లలకు వారానికి ఒక్కరోజైనా ఆనందవేదిక మీద ఉపాధ్యాయుల ద్వారా మంచి కథలు, పద్యాలు, గేయాలు , సాహిత్యం వినిపించాలి. వారితో కృత్యాలు చేయించి తెలుగు భాష మీద , బాల సాహిత్యం మీద మమకారం ఏర్పడే విధంగా ప్రయత్నించాలి. మోరల్ క్లాస్ ద్వారా మంచి కథలను వినిపించాలి. సెలవుల్లో ఇప్పుడు పెట్టినట్టే 'వుయ్ లవ్ రీడింగ్' కార్యక్రమం కొనసాగించి, పిల్లలకు ఉత్తమ బాల సాహిత్యాన్ని అందించాలి. బాలసాహితీవేత్తల పుస్తకాలను కొనుగోలు చేసి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందించాలి. కమిషన్ లకు కక్కుర్తి పడి ప్రతి ఏడాది ఉన్న పుస్తకాలనే మరొకసారి కొనుగోలు చేసి ప్రభుత్వ ధనం వృథాచేసి పుస్తకాలను మూల పడేసి చెదలకు ఆహారం చేసే బదులు మంచి పుస్తకాలను ఎంపిక చేసి కొనుగోలు చేయాలి. ప్రతి పాఠశాలలో గ్రంథాలయాన్ని విధిగా స్థాపించి పుస్తకాలను పిల్లలకు చేరువ చేయాలి. మంచి బాల సాహిత్యం రాసేలా రచయితలను ప్రోత్సహించాలి. వారికి పురస్కారాలను , బహుమతులను ఇచ్చి గౌరవించాలి. ప్రభుత్వాన్ని తిట్టే వారికి కొన్ని కమిటీలలో చోటిచ్చి వారి నోళ్లు మూయించే బదులు చిత్తశుద్ధితో దశాబ్దాలుగా కృషి చేస్తున్న వారిని గుర్తించాలి. వారి రచనలను ప్రోత్సహించాలి. వారి రచనలను పాఠ్యంశాలుగాచేర్చాలి. కొందరి అధికారులు పక్షపాత బుద్ధితో చేసినట్టు ఎప్పుడూ బాలసాహిత్యం రాయని వారి రచనలను పిల్లల తరగతి పుస్తకాలుగా ముద్రించి నిజమైన బాల సాహితీవేత్తలను అవమానించడం మానేయాలి. అప్పుడే చక్కని బాల సాహిత్యం సృజించబడుతుంది. చిన్నారులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచన చేసి బాల సాహిత్యాన్ని సేకరించి పౌర గ్రంథాలయాల్లోనూ, పాఠశాల గ్రంథాలయాల్లోనూ నిక్షిప్తం చేసినప్పుడే భవిష్య తరాలకు ఒక నిధిని అందించిన వారమవుతాము. ఇదే ఆలోచనలను సాహిత్య సంస్థలు కూడా పాటించాలి.

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
విశ్రాంత తపాలా ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

ప్రజాశక్తికి
43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
అత్యున్నత లక్ష్యాలు... ఉన్నత విలువలు
అంకితభావంతో... విపత్కర పరిస్థితులను అధిగమించి...
ప్రజాశక్తి అభివృద్ధికి కృషి చేస్తున్న పాత్రికేయులకు,
సిబ్బందికి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బిడ్డిక కొండలరావు
టిడిపి నాయకులు
బిడ్డిక పద్మావతి
టిడిపి సీనియర్ నాయకులు,
మాజీ సర్పంచ్, కొత్తగూడ గ్రామం
తెలుగుదేశం పార్టీ నాయకులు,
కార్యకర్తలు, అభిమానులు
కొత్తగూడ గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం,
పార్వతీపురం మన్యం జిల్లా

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం
నిరంతరం అక్షర సమరం చేస్తున్న
ప్రజా అభ్యుదయ పత్రిక
ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న సందర్భంగా
ఇవియే శుభాకాంక్షలు
జి.అచ్చియ్యమ్మ
ఎఇ, హౌసింగ్, కురుపాం
ఎస్.రాజేష్
వర్క్ ఇన్‌స్పెక్టర్
జి.సుధీర్‌కుమార్
డిఇఇ
మరియు సిబ్బంది, గృహనిర్మాణ శాఖ,
కురుపాం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

'ప్రతి అక్షరం - ప్రజల పక్షం' అనే నినాదంతో పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు,
కార్మికులకు అండగా ఉంటూ... నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతూ... అందరి మన్ననలు పొందుతున్న
ప్రజాశక్తికి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వెలిది సుబ్బారావు
కన్వీనర్, సత్యసాయి సేవా సమితి
బలిజిపేట
శ్రీమతి వెలిది తాయారమ్మ
మాజీ సర్పంచ్,
బల్జిపేట
వెలిది సాయిరాం
వైస్ ఎంపిపి, బలిజిపేట
తప్పిట ప్రసాద్
వైసిపి నాయకులు
చిలకలపల్లి, బల్జిపేట

ప్రజాశక్తికి
43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
పి.సరళ
జిల్లా అధ్యక్షురాలు,
పార్వతీపురం మన్యం
జె.సరోజ
ప్రాజెక్టు కార్యదర్శి,
కురుపాం
కె.విజయభవాని, ఎం.రజని
కురుపాం సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
ఎస్.సులోచన, డి.జ్యోతి
మొండెంఖల్ సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
ఎన్.కళావతి, ఎ.చామంతి,
ఆర్.కె.భాయి సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
జయసుధ, కె.సుజాత
చప్పగొత్తిలి సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
ప్రతిభ, సుశీల
కాకిలి సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
భాగ్యలక్ష్మి, సుశీల
డి.ఎల్.పురం సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
సుజాత, శకుంతల
ఆవిరి సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
కె.రమణమ్మ, ఎం.సుమతి
గుమ్మ సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
ఎ.గౌరీశ్వరి, జి.సుభద్ర
జియ్యమ్మవలస సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
అనూరాధ, అన్నపూర్ణ
అంకవరం సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
హైమా, బుజ్జి
ఆర్.ఆర్.బి.పురం సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
లక్ష్మి, వరలక్ష్మి
చినమేరంగి సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
బి.జయలక్ష్మి, డి.వెంకటరత్నం
గవరంపేట సెక్టార్ లీడర్స్
మరియు ఐసిడిఎస్ కార్యకర్తలు, హెల్పర్లు
అంగన్వాడీ కార్యకర్తలు మరియు హెల్పర్స్, ఐసిడిఎస్ ప్రాజెక్టు - కురుపాం

సాగునీటి వనరులపై చిన్నచూపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు అన్నారు.

శ్రీరామ్మూర్తి

నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో పంట పొలాలకు సరైన సమయంలో నీరు అందడం లేదన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్లు ద్వారానే నేటికి నీరు పంట పొలాలకు అందుతుందన్నారు. ఇవి కూడా పలుచోట్ల శిధిలమయ్యాయని వాటిని అభివృద్ధిపరిచే ఆలోచన చెయ్యకపోవడం విచారకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులు వర్షాధారం పైన ఆధారపడి ఖరీఫ్ సాగు చేస్తున్నారని తెలిపారు. తోటపల్లి ఎడమ కాలువ నీరు ఆలస్యంగా విడుదల చేయడంతో నేటికి చాలాచోట్ల వరి నాట్లు పడలేదన్నారు. ప్రతి ఏడాది రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేస్తున్నా అది పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదన్నారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కూడా కల్పించడం లేదన్నారు. దీంతో పండించిన పంటను వ్యాపారులకే అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. రానున్న రోజుల్లో రైతులు వ్యవసాయం వదిలి వలసలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



పాలకులు దృష్టిపెడితే అభివృద్ధి బాట

పార్వతీపురం మన్యం జిల్లా 2022 ఏప్రిల్ 4న ఏర్పడింది. విజయనగరం జిల్లాలో గల సాలూరు పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ నియోజక వర్గాలు, శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ నియోజవర్గంలో మొత్తం 15 మండలాలతో ఏర్పడింది. నేడు పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన ప్రాంతమంతా 1979లో విజయనగరం జిల్లా ఏర్పడక పూర్వం శ్రీకాకుళం జిల్లాలోదే.

విజయనగరం జిల్లా ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాలన్నింటి కంటే విద్య, వైద్యం, రోడ్లు మౌలిక వసతులు, తలసరి ఆదాయం అన్నింటా వెనుకబడిన జిల్లాగా ఉండేది. విభజన అనంతరం జిల్లాలు పునర్విభజన తర్వాత 26 జిల్లాల్లో కూడా పార్వతీపురం మన్యం జిల్లా అన్ని విధాలా వెనకబడిన జిల్లాయే. ఈ జిల్లాలో గిరిజన ప్రాంతం ప్రధాన భాగమైనందున జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కషి అవసరం. పాలకులు ఎప్పటి వలే నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు.

గిరిజనులు, దళితులు, బిసిల అభివద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జిల్లా మొత్తం జనాభా 9.72 లక్షలు. అందులో ఎస్సీ జనాభా 1.15 లక్షలు(11.83శాతం), ఎస్టీ జనాభా 2.65 లక్షలు (27.26శాతం) రెండూ కలిపితే 381418(39.09శాతం) అవుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మినహాయిస్తే అన్ని జిల్లాల కంటే గిరిజన ప్రాంతం ఎక్కువ గల జిల్లా ఇది. మొత్తం జిల్లాలో భూమి 393514 హెక్టార్లు ఉండగా సాగుకు అనువైన భూమి 167961 హెక్టార్లే. మొత్తం భూమిలో సాగుకు పనికి వచ్చే భూమి 42శాతమే. కొండలు, గుట్టలు ఎక్కువ. ఇప్పటికీ గిరిజనులు పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. దళితులకు దాదాపు భూమే లేదు. సాగు భూమి కూడా సమతలంలో ఉండదు. భూమి ఏటవాలుగా ఉండటం, ఇసుక నేల కావడం వలన నీరు నిలువ ఉండదు. అందువలన పంట దిగుబడి చాలా తక్కువ. తలసరి ఆదాయం కూడా తక్కువే.

జంఝావతి వెంటనే పూర్తి చేయాలి

నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజి నిర్మించినా పార్వతీపురం మన్యం జిల్లాకు ఉపయోగం లేదు. 1978లో ప్రారంభించిన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. దశాబ్దం దాటినా అడారు గెడ్డపై మినీ ప్రాజెక్టు సహితం పూర్తి చేయలేదు. రాష్ట్రంతో పోల్చుకుంటే జిల్లాకు వర్షపాతం ఎక్కువ. నిలువ చేసుకునే ప్రాజెక్టులు లేనందున వర్షపు నీరు ఉపయోగ పడడం లేదు. ఎక్కడికక్కడ కొండల్లో మినీ రిజర్వాయర్లు నిర్మించడం వలన గిరిజనుల భూమికి కొంత మేరకు నీరు ఇవ్వవచ్చు. ఎన్నో మినీ రిజర్వాయర్లు తక్కువ ఖర్చుతో నిర్మించే అవకాశం ఉన్నా పాలకుల నిర్లక్ష్యానికి గిరిజనులు బలైపోతున్నారు. గుమ్మిడి గెడ్డపై మినీరిజర్వాయర్లు ద్వారా వాడుకున్న నీరు కిందకు జారీ మరోసారి తోటపల్లి, వెంగళరాయ ప్రాజెక్టుల ద్వారా ఉపయోగపడుతుంది. గిరిజనుల ఆహార భద్రతకు ఇంత కంటే వేరే మార్గం లేదు.

పార్వతీపురం మన్యం.. ఎన్నో ప్రత్యేకతలకు నిలయం.. జిల్లా ముఖచిత్రం మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఒకింత ప్రత్యేకంగాను, వైవిధ్యంగాను కనిపిస్తుంది. ఓవైపు ఎత్తయిన కొండలు, దట్టమైన అటవీప్రాంతం, గిరిశిఖర గ్రామాలు విశాల విస్తీర్ణంలోనే దర్శనమిస్తాయి. అనేక అటవీ ఉత్పత్తులు ఈ ప్రాంతంలో లభ్యమౌతాయి. ఓవైపు అక్షరజ్ఞానం లేని గ్రామాలు... మరోవైపు అభ్యుదయ భావాలతో దోపిడీని వ్యతిరేకించే గ్రామాలు కూడా ఈ జిల్లా ప్రత్యేకతలు. జంఝావతి, తోటపల్లి వంటి జలాశయాలతోపాటు నాగవళి, సువర్ణముఖి వంటి జీవ నదులు జిల్లా సొంతం. కళలు, సాహిత్య రంగాలకు పార్వతీపురం పెట్టింది పేరు. అపారమైన వనరులున్నా ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన వెనుకబడిన ప్రాంతం.

మినీ రిజర్వాయర్లు నిర్మించాలి

గుమ్మిడి గెడ్డ, రాళ్ల గెడ్డ, తాడికొండ గెడ్డ, నూలు గెడ్డ, పావురాయి గెడ్డ, కనుసుల గెడ్డ, వలస బల్లేరు గెడ్డ, పనసభద్ర గెడ్డ, గాంద్ర గెడ్డ, కేదారిపురం గెడ్డ, ఇంకా అనేక గెడ్డలు, వాగులపై మినీ రిజర్వాయర్లు నిర్మించి గిరిజనుల భూమికి నీరు అందించవచ్చు. పెద్దగెడ్డ పై లిఫ్ట్ ద్వారా ఎడమ కాలువ నిర్మించి పాచిపెంట, సాలూరు రెండు మండలాల్లో పాచిపెంట, పద్మాపురం, కొత్తవలస, పెద్దవలస, కర్రివలస, పి.కోనవలస, కూర్మరాజుపేట పంచాయతీల్లో భూమికి సాగునీరు ఇవ్వొచ్చు. సాలూరు మండలంలో కారిగెడ్డ, పంది ఇరుకు గెడ్డ, కాగులు గెడ్డ, ములగ బంద గెడ్డల పై మినీ రిజర్వాయర్ కట్టవచ్చు.

ఎన్ సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

అల్లూరి సీతారామరాజు జిల్లా తర్వాత పరిశ్రమలు లేని జిల్లాగా పార్వతీపురం మన్యం

జిల్లా అవతరించింది. జిల్లాలో ఉన్నవి ఎన్సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ (లచ్చయ్యపేట), జీగిరాం జ్యూట్ మిల్లు రెండు పరిశ్రమలే. ఈ రెండూ మూతబడి ఉన్నాయి. షుగర్ ఫ్యాక్టరీ భూమి రియల్ ఎస్టేట్ చేసేశారు. వచ్చే ఏడాది ఫ్యాక్టరీని తీసివేసి భూమి అమ్మేసే ప్రమాదం ఉంది. సాలూరు జ్యూట్ మిల్లు కూడా అదే దిశలో ఉంది. మిల్లు తెరవాలని అడిగితే పాలకులు భూమి విస్తీర్ణం అడుగుతున్నారు. తెరవడానికి బదులు రియల్ ఎస్టేట్ చేస్తే తమకు ఎంత మేరకు లాభమో లెక్కలేస్తున్నారు. కొన్ని రైస్ మిల్లులు తప్ప మన్యం జిల్లాలో చిన్న పరిశ్రమ కూడా లేదు. కొత్తగా పరిశ్రమలు స్థాపించడం మాట అటుంచి ఉన్న షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను తెరవాలి. గతంలో ఎన్సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ ప్రభుత్వానిదే. మరల ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నడపాలి. అప్పుడే రైతులకు, కార్మికులకు భరోసా ఉంటుంది.

గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలి

గిరిజన ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే జీడి, పైనాపిల్, చింత పండు, తునికాకు తదితర అటవీ ఉత్పత్తులతో పరిశ్రమలు స్థాపించ వచ్చు. అటవీ ప్రాంతంలో ఎన్నో మెడిసినల్ ప్లాంట్స్ ఉన్నాయి. వాటితో ఆయుర్వేద మందులు ఉత్పత్తి చేయవచ్చు. అదనపు విలువ ఏర్పడి గిరిజనుల ఆదాయం పెరుగుతుంది. గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. ఇక్కడి అటవీ ఉత్పత్తులు వేరే చోటకు తరలిపోతే గిరిజనులు దోపిడీ చేయబడతారు తప్ప అభివద్ధి చెందరు.

ఇంజనీరింగ్, పి.జి కోర్సులు ప్రారంభించాలి

జిల్లాలో ఒక్క ఇంజనీరింగ్ కళాశాల కూడా లేదు. కురుపాంలో నిర్మాణంలో ఉంది. ఎంఎ, ఎం.కాం, ఎమ్మెస్సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, వంటి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ఉన్న కాలేజీ ఒక్కటీ కూడా జిల్లాలో లేదు. ఈ కోర్సులు చదవడానికి ఎక్కడికో వెళ్లి చదవాలన్నా జీఓ 77 ప్రకారం ఈ కోర్సులు చదివిన వారికి విద్యా దీవెన, వసతి దీవెన రెండూ ఇవ్వదు. అసలే పేదరికం. ఆ పైన వెనుకబాటు తనం. జిల్లాలో కాలేజీలు లేకపోవడం. ఇవన్నీ పేదల విద్య పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి రుజువులు.

కొత్తగా ఏర్పడ్డ జిల్లాలో సాలూరు, సీతంపేటలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు పెట్టాలి. పార్వతీపురం శ్రీ వెంకటేశ్వరా ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది గానుక (13 ఎకరాల భూమి ఉంది) యూనివర్సిటీగా అప్ గ్రేడ్ చేసి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించాలి. అలాగే సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించాలి. అపుడే వెనకబడిన పార్వతీపురం మన్యం జిల్లా విద్యాభివద్ధికి, అభివద్ధికి నోచుకుంటుంది.

మెడికల్ కాలేజీ వెంటనే నిర్మించాలి

మన్యం జిల్లాలో ఆరోగ్య వసతులు, ఆసుపత్రులు ప్రజల అవసరాలకు సరిపోగా లేవు. పార్వతీపురం ఏరియా ఆసుపత్రి మినహా ఆ పాటి వైద్యం జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేదు. ప్రభుత్వం ఇచ్చిన లెక్కలు ప్రకారం ప్రభుత్వ వైద్యులు జిల్లాలో 110 మంది ఉన్నారు. ఇందులో ఎంత మంది స్పెషలిస్ట్ డాక్టర్లు ఉన్నారు? ఇంత కొద్ది మంది డాక్టర్లతో 10 లక్షల మంది ప్రజలకు వైద్యం ఎలా చేయగలరు? అసలే ప్రజలు పేదలు. డబ్బు ఖర్చు చేసి ఎక్కడికో వెళ్లి వైద్యం చేయించుకోలేరు. ప్రభుత్వ వైద్యమే దిక్కు. అందువల్ల ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలి. పార్వతీపురం జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వెంటనే నిర్మాణం చేపట్టాలి. కురుపాం, పాలకొండ, సాలూరులో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలి. అపుడే మన్యం జిల్లా ప్రజలకు ఆరోగ్య భాగ్యం దక్కుతుంది.

రోడ్లు, వంతెనలు, మౌలిక సదుపాయాలు

ఇప్పటికీ చాలా గిరిజన గ్రామాలకు రోడ్లు లేవు. రోగమొస్తే గిరి జనులకు డోలీలమోతే దిక్కు. రోడ్లకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం ఆటంకం చెబుతున్నారు. గనులు కొల్లగొట్టుకుపోవడానికి కార్పొరేట్లకు 120అడుగుల గ్రీన్ ఫీల్డ్ హైవేకి ఎలా అనుమతులు ఇచ్చారు? 50 గ్రామాల గిరిజనులు, దళితులు, పేదలు నదిని దాటడానికి అవసరమయ్యే నాగావళి నదిపై పూర్ణపాడు – లాబేసు వద్ద వంతెన నిర్మాణానికి దశాబ్దాలు ఎందుకు గడిచిపోతున్నాయి? ఇదే రాజులకు, భూస్వాములకు అవసరమైతే క్షణాల్లో జరిగిపోదా?. రోడ్లు, వంతెనలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే మన్యం జిల్లా అభివృద్ధికి నోచుకుంటుంది.

పోరాడి జిల్లాను అభివృద్ధి చేసుకోవాలి

వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు, సాగునీరు, తాగునీరు, తలసరి ఆదాయం ఇలా అన్నింట్లోనూ వెనకబడిన మన్యం జిల్లా అభివద్ధి పట్ల పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కొత్తగా జిల్లా ఏర్పడినా పాలకులు ఎప్పటి వారే. పార్టీలు మారినా నాయకులు వారే. పాలకుల మీద ఆశలు పెట్టుకొని ప్రజలు పోరాడకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటుంది.కామ్రేడ్ రెడ్డి శ్రీరామ మూర్తి చొరవతో పార్వతీపురం మన్యం జిల్లాను పోరాడి సాధించుకున్నట్లే ప్రజలు అప్రమత్తమై పోరాటాల ద్వారా పాలకులపై ఒత్తిడి తీసుకు వచ్చి జిల్లా అభివద్ధికి దోహదం చేయాలి.

– ఎం.కృష్ణమూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు

అభివృద్ధిలో పార్వతీపురానికి గుర్తింపు తెస్తా

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర

ప్రజాశక్తి –పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో యువగళం యువనేత నారా లోకేష్, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విజన్‌తో ప్రజా సంక్షేమానికి పెద్దపీఠం వేసిన తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోతో పార్వతీపురం నియోజకవర్గాన్ని జాతీయస్థాయిలో ప్రాధాన్యతతో కూడిన ప్రత్యేకమైన గుర్తింపు పొందేలా అభివృద్ధికి బాటలు వేస్తామని టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

పార్వతీపురానికి ఒక చరిత్ర ఉంది. అయినా మనం ఎక్కడికి వెళ్లినా పార్వతీపురం అనే అడ్రస్ చెప్పుకోవటానికి బొబ్బిలి, విజయనగరం అడ్రస్‌లు చెప్పుకొనేలా పార్వతీపురం అభివద్ధి లేక మన అడ్రస్ మనమే చెప్పుకోలేని స్థితిలో ఉన్నాం. నర్సిపురంలోని బోనెల మార్కు, సువర్ణమ్మ దంపతులకు జన్మించాను. మా తండ్రి వృత్తి రీత్యా వైజాగ్‌లో ఉండడంతో ఒకటి నుండి నాలుగు వరకు అక్కడ చదివి, 5వ తరగతి నుండి 10వరకు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొప్పెర్ల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకున్నాను. ఇంటర్, ఇంజనీరింగ్ విశాఖలోనే ఉన్నత చదువులను పూర్తి చేశాను. ఉన్నత చదువుల తర్వాత రాంకీ, టిట్రా ప్యాక్ ఎస్‌విడి కంపెనీ (సౌత్ ఏషియా మార్కెట్) మేనేజర్‌గా పనిచేశాను. అంతర్జాతీయ ఫండింగ్ ఏజెన్సీ (ఫారెన్ ఫండ్స్)లో కొన్నాళ్లు పనిచేస్తూ గ్లోబల్ కమ్యూనిటీస్ ఆర్గనైజేషన్ ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న సంస్థలో రీజనల్ డైరెక్టర్‌గా ఇండియాలో పని చేస్తూ స్వతహాగా సిహెచ్‌ఎఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేసుకున్నాను. దీని ద్వారా ఫండింగ్ సమీకరణ చేసుకొని గుజరాత్‌లో సూరత్ అర్బన్ డెవలప్మెంట్ చేయడం జరిగింది. వీటితో పాటు యూరోపియన్ యూనియన్ ఏజెన్సీ ఫండింగ్‌తో పూణేలో ఓపెన్ డెఫ్టేషన్ స్లమ్ ఏరియా డెవలప్మెంట్ వంటి కార్యక్రమాలు నేషనల్ ఇంటర్నేషనల్ లెవెల్ అనేకంగా చేయడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోతో పాటు పార్వతీపురం నియోజకవర్గం అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళికతో కూడిన విజన్‌తో మన సొంతగెడ్డపై రాజకీయ రంగ ప్రవేశం జరిగింది.

తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో కూడిన ఆర్గనైజ్డ్‌గా పనిచేసే పార్టీ. కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఆత్మస్థైర్యం, అంకితభావంతో పనిచేసిన సైనికులు. నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన రోజున భాజా భజంత్రీలతో ఆహ్వానం పలికి ఊరేగింపులో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపిన ప్రేమాభిమానాలు మర్చిపోలేను. టిడిపి జాతీయస్థాయి ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా పనిచేసిన అనుభవంతో నియోజకవర్గంలో క్లస్టర్ స్థాయి, యూనిట్ స్థాయి, బూత్ లెవెల్ నాయకులను, కార్యకర్తలను సమన్వయపర్చుకుంటూ ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చే తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడతాం. ఆగస్టు 9 తర్వాత నియోజకవర్గంలో వారానికొక మండలాన్ని ఎంపిక చేసుకుని, ఆ మండల పరిధిలో ప్రతి గ్రామంలో మా పార్టీ మినీ మేనిఫోస్ట్, మహాశక్తి, రైతన్న, యువగళం కార్యక్రమాలను ప్రణాళికాయుతంగా ప్రజల్లోకి తీసుకుపోతాం. పార్వతీపురం ఆర్గానిక్ ఆహారపు ఉత్పత్తులు చింతపండు, అరటి ఫుడ్ ప్రాసెస్ మార్కెటింగ్‌కు అనువైన ప్రాంతంగా గుర్తించాను. అరకు కాఫీపై దేశ విదేశాల్లో విలువైన గుర్తింపును పొందేలా ఆహారపు ఉత్పత్తుల మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పిస్తున్నాను. దీనివల్ల వ్యవసాయం చేసే రైతులు, మార్కెటింగ్ చేసే వ్యాపారుల అభివృద్ధితో పాటు, ఫుడ్‌ప్రాసెస్ పరిశ్రమల్లో యువతకు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీటి ఇబ్బందులు ప్రత్యక్షంగా చూశాను. ఇలాంటి ఉదాహరణలు చాలా చెప్పొచ్చు. ఈ ఆధునిక యుగంలో కూడా కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేని రాజకీయాలు చేయడం బాధాకరంగా ఉంది. తప్పకుండా వాటిపై దృష్టి సారిస్తాను. రాష్ట్రంలో అతి త్వరలో ఎన్నికల రావటం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం తథ్యం. నియోజకవర్గంలో కేడర్ మొత్తాన్ని కలుపుకొని పనిచేసే దాంట్లో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జిసిసి లక్ష్యం రూ. 64.75కోట్లు

- గతేడాది లక్ష్యాన్ని దాటేశాం
- డిఆర్ డిపోల్లో అన్ని అందుబాటులోకి
- పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రయత్నాలు
- జిసిసి డివిజనల్ మేనేజర్ జి సంధ్యారాణి

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన సహకార సంస్థ గిరిజనులు కోసం ఏర్పాటు చేశారని వారు శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులకు జిసిసి స్వయంగా కొనుగోలు చేసి మార్కెటింగ్ ధర కల్పిస్తుందని సీతంపేట గిరిజన సహకార సంస్థ

డిఎం సంధ్యారాణి

డివిజనల్ మేనేజర్ జి. సంధ్యారాణి అన్నారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ గిరిజనులకు అవసరమైన వస్తువులు కొండలపై ఉన్న జిసిసి నిర్వహిస్తున్న డియర్ డిపోలో గుండుసూది నుండి అన్ని సరసమైన ధరలకు అందిస్తున్నామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి ఆదేశాల మేరకు జిసిసి ద్వారా పెట్రోల్ బంక్, గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

సీతంపేట గిరిజన సహకార సంస్థ డివిజన్ కార్యాలయంలో పాతపట్నం, సీతంపేట రెండు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఈ బ్రాంచీల పరిధిలో 57 డిఆర్ డిపోలో నడుస్తున్నాయి. కొండలపై నివాసం ఉంటున్న గిరిజనులు కిందకు దిగకుండా వారున్న చోటే డిఆర్ డిపోలు ఏర్పాటు చేసి గిరిజనులకు గుండుసూది నుంచి అన్ని అవసరమైన వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నాం. ఈ డివిజన్‌లో ఈ ఏడాది రూ.64.75 కోట్లు లక్ష్యాలు పెట్టుకున్నాం. గతేడాది రూ.40 కోట్లు టార్గెట్ నిర్ణయించగా రూ.54 కోట్లు లక్ష్యాలను అధిగమించాం.

బ్రాండెడ్ వస్తువులు సరఫరా

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉన్న ఆశ్రమ పాఠశాలకు, గురుకుల పాఠశాలకు, గిరిజన సహకార సంస్థ ద్వారా బ్రాండెడ్ నిత్యవసర సరుకులు పిఒ ఆదేశాల మేరకు సరఫరా చేస్తున్నాం. గతంలో పామాయిల్ అయితే ప్రస్తుతం రిఫండ్ ఆయిల్, త్రీ మ్యాంగో, సెనగపప్పు, అజంత గోల్డ్ అకోలా, కందిపప్పు, తెనాలి మినప గుళ్ళు, విజయ టెట్ మిల్క్ ప్యాకెట్లు, జిసిసి బ్రాండ్ కారం పసుపు, విడివికే బ్రాండెడ్ జీడిపప్పు, పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం.

ఏడు రిటైల్ మార్కెటింగ్ అవుట్లెట్స్

జిసిసి ద్వారా రిటైల్ మార్కెటింగ్ అవుట్లెట్స్ ఏడు కేంద్రాలు నెలకొల్పాం. అవి శ్రీకాకుళం, పాతపట్నం, సీతంపేటలో రెండేసి, ఎచ్చెర్లలో ఒకటి పెట్టి వాటి ద్వారా గిరిజన బ్రాండెడ్ వస్తువులు అరుకు కాపీ పొడి, పెయిన్ రిలీఫ్ ఆయిల్, హ్యాండ్ వాష్, ఫ్లోరింగ్ ఆయిల్, కుంకుడుకాయ షాంపూలు, అలోవెరా సోప్స్, కారం, పసుపు, తేనె, హెయిర్ ఆయిల్, కల్తీ లేని వస్తువులు తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు విక్రయిస్తున్నాం.

15 అటవీ పల సాయం కొనుగోలు కేంద్రాలు

ఈ డివిజన్లలో 15 అటవీ పలసాయం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ ధర కల్పించి కొనుగోలు చేస్తున్నాం. 500 కింటాలు కుంకుడుకాయలు కొనుగోలు చేశాం. 31 టన్నులు చింతపండు, 1.40లక్షల కొండ చీపుర్లు కొనుగోలు చేశాం. ఇది విశాఖపట్నంలో మెటల్ స్క్రాప్ట్ ట్రేడ్ ఆపరేషన్ ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాం ద్వారా విక్రయించాం. రిజిస్ట్రేషన్ అయిన వ్యాపారులు మాత్రమే (ఎమ్మెస్ టిసి) అర్హులని ఆమె తెలిపారు. సీతంపేట డివిజన్ పరిధిలో 68 వీడీవీకే వన్ ధన్ వికాస కేంద్రాలు ద్వారా పివో ఆదేశాల మేరకు జీడి, అగరబత్తులు, మిల్లెట్ బిస్కెట్లు, కొబ్బరి చెక్కి, నువ్వులు చెక్కి, చిప్స్ మార్కెటింగ్ చేస్తున్నాం. మరొక 50 పివి టీజీలు ద్వారా విడివికే కేంద్రాలు ఏర్పాటు చేయడానికి గుర్తిస్తున్నామని ఆమె వెల్లడించారు.



తొమ్మిదేళ్ల ఆలస్యంగా తొలి అడుగు

- నిర్మాణానికి ఇంకెన్నాళ్లో...
- గిరిజన వర్సిటీ నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేనా?
- పరాయి పంచల్లో ప్రయోగాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి అడుగు తొమ్మిదేళ్ల ఆలస్యంగా పడింది. ఇక నిర్మాణానికి ఇంకెన్నేళ్లు పడుతుందో..? అంటూ అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. మరోవైపు తరగతుల నిర్వహణ, విద్యార్థుల ప్రయోగాలు పరాయి పంచన సాగుతున్నాయి. తగిన వసతులు లేక విద్యార్థులు తీవ్ర అస్థలు పడుతున్నారు.

రాష్ట్ర విభజనలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. దీని ఏర్పాటుకు తొలుత 'అదుగో ఇదిగో..' అంటూ నెట్టుకొచ్చింది. గతంలో టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు కూడా భూసేకరణ పేరుతో కాలం గడిపాయి. టిడిపి ప్రభుత్వంలోనే కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో భూమి సేకరించి, నష్టపరిహారం కూడా చెల్లించి నప్పటికీ వైసిపి వచ్చాక రద్దుచేసింది. నాలుగైదు చోట్ల భూమి పరిశీలించి చివరికి మెంటాడ మండలం కుంటినవలస మధుర గ్రామం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలసలో భూమిని గుర్తించారు. అనేక ఊగిసలాటల తరువాత కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయం నిర్మాణానికి 561.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. సహజ సిద్ధమైన చెరువులు, నీటి గుంతలు పోగా నిర్మాణానికి అనువైన 519 ఎకరాల భూమిని ఈ ఏడాది జులై 6వ తేదీన యూనివర్సిటీ యాజమాన్యానికి జిల్లా యంత్రాంగం అప్పగించింది. కానీ, నిర్మాణ పనులపైనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. భూమి గుర్తింపు, అప్పగింతలకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొమ్మిదేళ్లు తాత్సారం చేశాయంటే నిర్మాణానికి ఇంకెన్నాళ్లో అంటూ అనుమానాలు రావడం సహజమే. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. ఎట్టకేలకు 2019-20లో ఏర్పాటుచేసిన గిరిజన వర్శిటీకీ కేంద్రం తొలి నాలుగేళ్లూ నిధులు కేటాయించలేదు. ఆ తరువాత తరగతుల నిర్వహణకు తగ్గట్టు లేదా అంతకన్నా తక్కువ రూ.18కోట్లు చొప్పున కేటాయిస్తూ వచ్చింది. తాజాగా వర్శిటీకి భూమి కేటాయింపు తరువాత కూడా నిధులు కేటాయింపుపై నోరు మెదపలేదు. మౌలిక సదుపాయాల పేరిట కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50కోట్లు ఏమూలకూ సరిపోని పరిస్థితి ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు.

సిటియు విసి కట్టమణికి భూమి పత్రాలు అందజేస్తున్న ఎస్‌డిసి సుదర్శనదొర తదితరులు

ప్రస్తుతం గాజులరేగ సమీపంలో పాత ఎయు క్యాంపస్‌లో గిరిజనవర్శిటీ తరగతులు నిర్వహిస్తున్నారు. వర్శిటీలో 200మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం 12కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని కోర్సుల ఏర్పాటుకు

మెంటాడ మండలం కుంటినవలస సమీపాన గిరిజన యూనివర్సిటీకి గుర్తించిన స్థలం

అనుమతులు లభించినప్పటికీ వసతి సమస్య వల్ల ముందుకు సాగలేని పరిస్థితి. ఉన్న డిపార్ట్‌మెంట్లకే భవనాలు, గదులు సరిపోవడం లేదు. 12మంది ఫ్యాకల్టీ ఒకే గదిలో కూర్చోవాల్సివస్తోంది. ఇక విద్యార్థుల సమస్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధార పడుతున్నారు. తరగతులొక చోట, ప్రయోగాలు మరోచోట, పరిశోధనలు ఇంకోచోట జరుగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్శిటీ హాస్టల్ నిర్వహణకు నిధులు ఉన్నప్పటికీ అందుకు తగ్గ భవనం లేదు. దీంతో, సమీపంలోని సీతం కాలేజీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ 100మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించారు. మిగిలిన విద్యార్థులు అక్కడ కూడా ఉండేందుకు అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. జర్నలిజం విభాగంలో గత ఏడాది 18మంది చేరగా వసతి, తరగతి గదులు, లైబ్రరీ, లేబొరేటరీ వంటి సదుపాయాలు లేకపోవడంతో 15మంది ఇతర వర్శిటీలకు వెళ్లిపోయారు. ఇక సెమినార్ హాళ్లు, ఆట స్థలాలు, సెంట్రల్ లైబ్రరీ వంటి సదుపాయాల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. గిరిజన ప్రాంతాలపై పరిశోధనలు అనే మాటే లేదు. దీంతో, గిరిజన వర్శిటీ లక్ష్యం నీరుగారుతోంది. గత ఏడాది నవంబర్ 12న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వచ్చిన సందర్భంగా గిరిజన విశ్వవిద్యాలయాలకు శంకుస్థాపన చేస్తారని ప్రకటించడంతో ఇన్నాళ్లకైనా మోక్షం కలుగుతుందని చాలా మంది భావించారు. ఆచరణలో అటువంటిదేమీ కనిపించలేదు.

టిటిపిఆర్ నిర్వాసితులకు అందని పరిహారం

- పునరావాసానికీ నోచుకోని దుస్థితి
- ఊళ్లు, భూములు త్యాగం చేసిన వారికి ఇబ్బందులు తగునా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పుట్టిపెరిగిన ఊళ్లు, తాతతండ్రుల నాటి భూములు త్యాగం చేసి నాలుగు దశాబ్దాలు కావస్తున్నా జిల్లాలోని టిటిపిఆర్ (తోటపల్లి, తారక రామతీర్థసాగర్) ప్రాజెక్టుల నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం పూర్తిస్థాయిలో అందలేదు. పాలకులు 'యేరు దాటే వరకు ఓడ మల్లన్న, ఒడ్డుకు చేరాక బోడిమల్లన్న' అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై... బతుకు భారమై తల్లడిల్లుతున్నారు. నిర్వాసిత సమస్యలను అధ్యయనం చేసేందుకు గత ఏడాది జులైలో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

జిల్లాలో నాలుగు మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు అవసరం కానుందని 2016లో అధికారులు అంచనా రూపొందించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల పెరిగిన ధరల నేపథ్యంలో రూ.87కోట్లు వరకూ పెరిగేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.204కోట్లు అవసరం

తోటపల్లి నిర్వాసిత గ్రామం సుంకి

ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు. 2003లో తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడలతోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. చట్ట ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అర్‌అండ్‌ఆర్ కింద రూ.119.1 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8కోట్లు అవసరం కానుంది. ఆర్‌అండ్‌ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నేపథ్యంలో సిపిఎం, నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యాన నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధమౌతున్నారు.

నిధులు రావాల్సి ఉంది

తారకరామ తీర్థసాగర్ పరిధిలో భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన వారు 819మంది ఉన్నారు. కేవలం భూములు కోల్పోయినవారు 1398 మంది వరకు ఉన్నారు. వీరందరికీ మొత్తంగా రూ.204కోట్లు కోట్ల మేర రావాల్సివుంది. కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీచేసింది. లబ్ధిదారులకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా వచ్చింది. నిధులు విడుదల కావడమే తరువాయి. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 20 గ్రామాలకుగాను 13గ్రామాలను తరలించి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాం. మిగిలిన ఏడు గ్రామాలకు ఇంకా పునరావాసం కల్పించాల్సివుంది. అప్పట్లో మంజూరు చేసిన రూ.58వేలు సరిపోవని, ఇప్పటి ధరలకు అనుగుణంగా కనీసం రూ.3లక్షల చొప్పున ఇవ్వాలని వారు అడుగుతున్నారు.

- సుగుణాకరరావు, టిడిపిఆర్ ఎస్ఇ

కేటాయింపులు కాదు.. విడుదల చేయాలి

నిర్వాసితులకు ప్రభుత్వం ఏటా కేటాయింపులు చేస్తే సరిపోదు. నిధులు విడుదల చేసి, ఆచరణాత్మకంగా వ్యవహరించాలి. తారకరామ సాగర్‌కు భూములు సేకరించి సుమారు 18ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ పునరావాసం కల్పించకపోవడం, నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయం. పోలవరం విషయంలో కేంద్రంలోని బిజెపి అనుసరించినట్టే మన జిల్లాలో తారకరామ తీర్థసాగర్ నిర్వాసితుల విషయంలో వైసిపి వ్యవహరిస్తోంది. నిర్వాసితుల తరపున సిపిఎం తొలి నుంచీ పోరాడుతోంది. ఇక ముందూ పోరాడుతుంది.

- రెడ్డివేణు,
సిపిఎం జిల్లా కార్యదర్శి

మన్యంలో మౌలిక వసతులు

- హామీలన్నింటినీ నెరవేరుస్తున్నా
- కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో మౌలిక వసతులు కల్పన, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి తెలిపారు. కనీస అవసరాలైన తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు ఆమె చెప్పారు. ప్రతి పేదవాడికి అండగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించామన్నారు. గిరిజనుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని చెప్పారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే ...

నియోజకవర్గాన్ని రూ.900కోట్లుతో అభివృద్ధి చేశాం. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో రూ.122.2కోట్లుతో కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణమవుతుంది. రైతులకు సాగునీరందించాలనే లక్ష్యంతో రావాడ, వటిగెడ్డ ప్రాజెక్టులను రూ.44.9కోట్లు జైకానిధులతో అభివృద్ధి చేస్తునాం. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గిరిజనులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించే లక్ష్యంగా రూ.12కోట్లు అదనపు భవనాలు నిర్మిస్తున్నాం. అలాగే నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా రెండు విడతల్లో నియోజకవర్గంలో 329 పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. మొదటి విడత నాడు-నేడు నిధులు రూ.44.2కోట్లు వెచ్చించి 182 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా అన్ని హంగులతో తీర్చిదిద్దాం. ప్రస్తుతం రెండో విడత నాడు-నేడు కింద మరో 147 పాఠశాలలను రూ.37.6కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నాం. అలాగే నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.4.9కోట్లుతో నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. నియోజకవర్గంలో మారుమూల గిరిజనులకు తాగునీరందించే లక్ష్యంతో రూ.143కోట్లు జెఎంఎం నిధులతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. ఏజెన్సీ ప్రజలను వేధిస్తున్న రహదారి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పెద్ద మొత్తం నిధులు కేటాయించింది. నియోజకవర్గంలోని 62రోడ్లును రూ.222కోట్లు వెచ్చించి మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాం. ఇందులో ఆర్అండ్‌బి శాఖ 23 రోడ్లు పనులు పూర్తి చేయగా, గిరిజన ఇంజినీరింగ్ విభాగంగా 21రోడ్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ వారు 21 రోడ్లు పూర్తి చేశారు. మిగిలిన రోడ్లు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటితో పాటు బిటి రోడ్ల అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో గ్రావెల్ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణానికి రూ.91కోట్లు కేటాయించడం జరిగింది. కురుపాంలో రూ.12కోట్లుతో ఏకలవ్య పాఠశాలను నిర్మించడం జరిగింది. అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి రూ.8.7కోట్లు, గురుకుల పాఠశాలలో అదనపు భవన నిర్మాణానికి రూ.5కోట్లు ఖర్చు చేయడం జరిగింది. నియోజకవర్గంలో రూ.89కోట్లుతో 350 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బిఎంసి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండో తిరుపతిగా పేరుగాయించిన తోటపల్లి దేవస్థానాన్ని రూ.80లక్షలతో అభివృద్ధి చేపడుతున్నాం.

నియోజకవర్గంలో రాష్ట్రప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కింద ఈ నాలుగేళ్లలో రూ.800కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఆసరా పథకం కింద 44048మందికి రూ.39.8కోట్లు, అమ్మఒడి కింద 25014మందికి రూ.64.5కోట్లు, రైతు భరోసా కింద 42,898మందికి రూ.151కోట్లు, వైఎస్ఆర్ పెన్షన్ల కింద 42865మందికి రూ.317కోట్లు, వైఎస్ చేయూత కింద 19,645మందికి రూ.103కోట్లు, వైఎస్ఆర్ చేదోడు కింద 1978మందికి రూ.3.5కోట్లు, పంటల బీమా కింద 2382కోట్లు మందికి రూ.7.8కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1327మంది రైతులకు రూ.5కోట్లు, సున్నావడ్డీ కింద 11,543మంది రైతులకు రూ.3.1కోట్లు, జగనన్న వసతి దీవెన కింద 8306మందికి రూ.9.2కోట్లు, జగనన్న విద్యాదీవెన కింద 17785మందికి రూ.26.8కోట్లు, వాహన మిత్ర కింద 1152మంది ఆటో డ్రైవర్లకు రూ.2.7కోట్లు, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆసరా కింద 1227మందికి రూ.85కోట్లు, 53672 మంది మహిళలకు సున్నా వడ్డీ రుణాలు 3.6 కోట్లు, ఇబిసి. లా, నేతన్న, కాపు నేస్తం, అర్చకులకు, పాస్టర్లకు మత్స్యకారులకు రూ.10కోట్లు సంక్షేమ పథకాలు అందజేశాం. వీటితో పాటు ఇతర పథకాలకు రూ.100కోట్లు ఖర్చు చేసి పేదలను ఆదుకున్నాం.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కమిషనర్ జె. రామప్పలనాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్వతీపురం మున్సిపాలిటీ గ్రేడ్ వన్‌గా గుర్తింపు పొంది అభివృద్ధి పథంలో నడుస్తోందని, పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడడంతో, మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పాలకవర్గ కౌన్సిల్ సభ్యుల సూచనలు, సలహాలతో మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు, సిబ్బంది సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా మరిన్ని విషయాలను ఆయన వెల్లడించారు. పార్వతీపురం మున్సిపాలిటీకి ఇంటి పన్నులు, కొళాయి పన్ను, మున్సిపల్ వాణిజ్య సముదాయాలపై వచ్చిన అద్దెలు, భవన నిర్మాణ ఫీజులు, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నులు, అపరాధ రుసుము వసూళ్లు, ఇతరత్రా వాటిపై ఏటా రూ.9 కోట్లు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 కోట్ల వరకు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పట్టణ సుందరీ కరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పట్టణంలో 30 వార్డులలో సిసి రోడ్లు, కాలువలు, కల్వర్టులు, శ్మశాన వాటికల అభివృద్ధి పనులు చేస్తున్నాం. మరికొన్ని అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యుల ఆమోదం కూడా తీసుకున్నాం. క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ బాగా జరుగుతుంది. దోమల నివారణకు కార్మికులచే ఫాగింగ్ నిర్వహిస్తున్నాం. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేయిస్తున్నాం. వర్షాకాలం దృష్ట్యా నాగావళి, జంఝావతి నదులలో ప్రవాహాలు ఉధృతమైనప్పుడు ఇన్ ఫిల్టరేషన్ బావులలో వరద నీరు చేరి కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా జరగడం కొంత ఇబ్బందికరమైన విషయం. బురద నీరు సరఫరా జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ఎఐఐబి

బ్యాంకు ద్వారా సమగ్ర తాగునీటి సరఫరాకై రూ.63.63 కోట్లు మంజూరు అయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ పైపు లైన్ పనులు మొదలుపెట్టి నిలిపివేశారు. మళ్లీ త్వరలో పనులు ప్రారంభిస్తాం. పట్టణంలో అక్రమ భవన నిర్మాణాలను గుర్తించి సంబంధిత భవన యజమానులకు కోర్టు నోటీసులు అందజేస్తున్నాం. అనధికార లే అవుట్‌లను గుర్తించి యజమానులపై చర్యలు తీసుకుం టున్నాం. ప్లాస్టిక్ నివారణకు శానిటరీ సెక్రటరీలు ప్రత్యేక పర్యవేక్షణ చేసి అమ్మకాలు కొనుగోలు పై తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. స్థల సేకరణ జరిగిన వెంటనే డంపింగ్ యార్డ్ వేరే ప్రదేశానికి తరలించేందుకు చర్యలు చేపడతామని తెలిపినట్లు మన్సిపల్ కమిషనర్ తెలిపారు.

జనంలోకి జనసేన ఆశయాలు

జనసేన నాయకులు అక్కివరపు మోహన్‌రావు

ప్రజాశక్తి - పార్వతీపురం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయనను సిఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆ పార్టీ జనసేన నాయకులు అక్కివరపు మోహన్‌రావు తెలిపారు. నియోజకవర్గంలో గ్రామ బాట, రచ్చబండ చర్చ వేదికలు, ఆత్మీయ కలయికలు వంటి కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లి వారితో మమేకమై సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. 'ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు వివరాలు మరిన్ని ఆయన మాటల్లోనే....

1994నుంచి 2007 వరకు క్రిస్టియన్ మిషనరీలో పాస్టర్‌గా పని చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లాలో అనేక క్రిస్టియన్ సంఘాలతో మమేకమై ఆయా సంఘాల్లోని సభ్యులను కష్ట సుఖాల్లో ఆదుకోవడం ద్వారా మంచి గుర్తింపును పొందాను. 2007లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్వహిస్తూ ఎంఆర్ఎ ప్రొడెక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ స్థాపించాను. ఆ తర్వాత ప్రజా సేవ చేయాలనే సంకల్పం నాలో బలపడింది. మొదట ప్రజా సంఘాల జెఎసిని ఏర్పాటు చేసి సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి అనేక సమస్యలు, అవినీతిపై పోరాడి ప్రజలకు అండగా నిలబడ్డాను. ఆ తరువాత క్రమంలో రాజకీయాల వైపు మనసు మళ్ళింది. అప్పట్లో మక్కువలో నివాసంగా ఉంటూ తెలుగుదేశం పార్టీలో చేరి ప్రజాసేవలో ప్రజలకు దగ్గరయ్యాను. ప్రజలకు న్యాయం చేయాలంటే ప్రజలచే నాయకుడిగా ఎన్నుకోబడాలి. ప్రజా జీవితంలో జీవించిన నాడు ప్రజల ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుంది. ప్రజా ప్రతినిధిగా ఉండాలని నా అనుచరులు ఒత్తిడి చేస్తుంటారు. అలా వచ్చేది పదవి కాదు. ప్రజలకు న్యాయం చేయగలమన్న

ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్న జనసేన నాయకులు అక్కివరపు మోహనరావు

నమ్మకాన్ని కలిగినప్పుడు ప్రజలే పదవిని కట్టబెడతారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన అందించి, అవినీతి లేని పాలన రాష్ట్ర ప్రజలకు అందాలంటే పవన్ రావాలి పాలన మారాలని ధృడంగా నమ్మి జనసేన పార్టీ విధి విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుంది.

పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో రచ్చబండ చర్చా వేదికను ఏర్పాటు చేసి గ్రామ సమస్యలలో ఉపాధి కూలీలకు సకాలంలో కూలి అందక, పనిచేసే చోట మంచినీళ్ల నీడ వంటి సౌకర్యాలుకల్పించకపోవడం, వీటితో పాటు స్థానిక సమస్యలపై రచ్చబండపై చర్చ జరపగా వీటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కషి జరిగింది. ఇదే మండలంలో డీకే పట్నం, నిడికివలస, గోచక్క గిరిజన గ్రామాల్లో గ్రామ బాట నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నాం. ఇటీవల ఆ గ్రామాలలో వైసీపీ ఎమ్మెల్యే జోగారావును తాగునీటి సమస్యపై జన సైనికులు అడ్డుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించని ఎమ్మెల్యే మా కార్యకర్తలపై కేసులు పెట్టడం హేయమైన చర్య. పవన్ కల్యాణ్ నిస్వార్థం, నిరాడంబర జీవితాన్ని చూసిన రాష్ట్ర ప్రజలు జనసేనపై అభిమానం పెరుగుతుంది. బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో పలు గ్రామాల్లో మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్లు యువత పార్టీలో చేరుతున్నారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదర్శాలు తో కూడిన ఆశయాలకు ఆకర్షితుడునై 2022లో జనసేన క్రియాశీలక సభ్యుడిగా చేరాను. అధికారంలో లేకుండా రాష్ట్రంలో రూ.30కోట్లు పంపిణీ చేసి,ఆపదలో ఉన్న రైతులను ఆదుకొని రైతు బాంధవుడైన పవన్ కళ్యాణ్ బాటలో నడవాలని సంకల్పించాను. పార్వతీపురం నియో జకవర్గ ప్రజల ఇబ్బందులను తెలుసుకొని నాకు చేతనైన సహాయాన్ని అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది. బలిజిపేట మండలంలో అజ్జాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రైతుల ధాన్యం కాలిపోవడంతో వారికి సహాయాన్ని అందిం చాం. సీతానగరంలో పేదవారి ఏడు ఇళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోతే వారికి కూడా ఆర్థికసాయం చేశాం. బలిజిపేట మండలం చెల్లింపేటలో ఏనుగుల బారిన పడ్డ బాధితులకు సహాయం చేశాం. అదే గ్రామంలో ఒక పేద కుటుంబ మహిళ పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి పెళ్లి సారి కొనుగోలు చేసి ఖర్చులు నిమిత్తం కొంత డబ్బు ఇచ్చి ఆదుకోవటం చాలా ఆనందాన్నిచ్చింది. సహాయార్థంలో ప్రజలకు అండగా ఉంటూ అదే మండలంలో పలగరలో 2000 మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి జనసేన ఆశయాలను తెలియజేశాం. నియోజకవర్గ పరిధిలో మూడు మండలాల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి జనసేన విధి విధానాలపై చర్చలు జరిపి నియోజకవర్గంలో జనసేన కేడర్‌ను సమన్వయంతో నడిపేందుకు ఈ ఆత్మీయ కలయిక సమావేశం సద్వినియోగమైంది.

ప్రజా సేవతోనే ప్రజాదరణ పొందా..

ఎస్‌సి కమిషన్ సభ్యులు సవరపు జయమణి

ప్రజాశక్తి- సీతానగరం

గ్రామస్థాయి నుండి నియోజకవర్గస్థాయి వరకు ప్రజా సేవలోనే ప్రజలలో ఆదరణ పొందడం, సిఎం జగన్ రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్‌గా పదవినిచ్చి గుర్తించారని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ కమిషన్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే...

మా స్వగ్రామంలో 1991లో ఆదర్శ మహిళా మండలి ఏర్పడింది. ఈ నేపథ్యంలో 32 ఏళ్ల కిందట సామాజిక సేవా కార్యక్రమాలతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను. మహిళా మండలి నాయకురాలుగా, సామాజిక కార్యక్రమాల గుర్తింపుతో 1995లో అప్పటి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలుగా పోటీ చేసేందుకు అవకాశాన్ని ఇవ్వడంతో విజయం సాధించాను. మండల అభివృద్ధి నిధులతో గ్రామ నాయకులకు ప్రాధాన్యతనిచ్చి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయగలగటం, ప్రజల అభిమానాన్ని పొందాను. మరలా 2001లో సీతానగరం జెడ్‌పిటిసిగా ఏకగ్రీవంగా ప్రజలు ఎన్నుకొని ప్రజాసేవలో మరో మెట్టు ఎక్కించారు. జెడ్‌పి నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, అదనపు తరగతి గదులు, తాగునీరు, సాగునీరు, మండలంలో అన్ని గ్రామాలకు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాను. 2005 నుంచి 2008 సంవత్సరం వరకు పార్టీ జనరల్ సెక్రెటరీ గాను, 2008 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశాను. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఎస్‌సి జనరల్ రిజర్వేషన్ కావడంతో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం 59 మంది పోటీపడ్డారు. నాకున్న ప్రజాధరణను గుర్తించిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి టికెట్ ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నియోజకవర్గ ప్రజలు అఖండ విజయం అందించారు. 2009 నుండి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉంటూనే రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్, రాష్ట్ర మహిళా వెల్ఫేర్ ఆఫ్ ఉమెన్ డిజేబుల్, ఓల్డ్ ఏజ్ స్పెషల్ ఇన్వాయిటీస్ స్టేట్ మెంబర్ అఫ్ లైబ్రరీలలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అప్పజెప్పిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి ఆయనతో ప్రశంసలు పొందడం రాజకీయ జీవితంలో మరుపురాని ఘట్టం. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పన కై డీశిర్లాం పైలెట్ ప్రాజెక్టు, సీతానగరం నుండి నర్సిపురం వరకు పైలెట్ ప్రాజెక్టులను మంజూరు చేసి ప్రతి గ్రామానికి రూ.10 లక్షలు చొప్పన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రజల దాహం తీర్చాను. ప్రతి గ్రామానికి లింకు రోడ్డులు, వ్యవసాయ అభివృద్ధికి నీటిపారుదల కాలువలను బాగు చేశాం. ప్రధాన రహదారులు, బిటి రోడ్లుతో పాటు విద్యాభివృద్ధికి అదనపు తరగతి గదులను నిర్మాణాలు చేపట్టాం. నియోజకవర్గంలో పాలిటెక్నికల్ కాలేజీకి స్థల సేకరణ చేసి భవనాలు నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేశాం. పార్వతీపురంలో టిటిడి కళ్యాణ మండపం, ప్రస్తుతం ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రిని అభివృద్ధి చేశాం. నియోజకవర్గంలో వైసిపికి నిజాయితీగా, నమ్మకంతో పనిచేసిన మాజీ ఎమ్మెల్యేనని గుర్తించి 2022లో సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. అప్పటి నుండి నియోజకవర్గంలో అన్ని గ్రామాలు పర్యటించి మహిళల కష్ట సుఖాలు తెలుసుకుని వారికి అండగా నిలబెడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందడం చాలా సంతోషంగా ఉంది అని ఆమె తెలిపారు.

నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సభ్యులే

2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత భర్త రామారావుతో కలిసి నియోజక వర్గంలో ప్రజలందరి తోనూ కలిసిమెలసి ఉంటూ వారి కష్ట సుఖాలను తెలుసుకున్నాం.

వచ్చి వారి కష్టసుఖాలు చెప్పుకొని మా సహాయాన్ని పొంది వెళ్లేవారు. ఇదే బంధం నేటికీ కూడా

కొనసాగుతోంది. వైయస్సార్ పార్టీ కేడర్, ప్రజలు బంధుత్వాన్ని చూపుతున్న ప్రేమాభిమానాల వల్లే 2024 ఎన్నికల్లో టిక్కెట్ రేసులో ఉన్నామన్న ప్రచారం ఎక్కువగా జరుగుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీకి బరిలో ఉంటాం.



ఏజెన్సీలో టిడిపి అభివృద్ధికి కృషి

టిడిపి సీనియర్ నాయకులు
బిడ్డిక పద్మావతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో టిడిపి పూర్వ వైభవానికి కృషి చేస్తున్నట్లు సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే టిక్కెట్ ఆశావాహి బిడ్డిక పద్మావతి అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. బాదుడే బాదుడు, ఇదేం కర్మ, భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి వంటి కార్యక్రమాలతో 27 పంచాయతీల్లో ప్రతి గ్రామానికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో గిరిజన అభివృద్ధి కనీసం జరగలేదన్నారు. గిరిజనులకు ఉన్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజన గ్రామాల్లో కనీసం తాగడానికి మంచినీరు కూడా దొరకడం లేదని మద్యం మాత్రం ఏరులైపారుతుందని మండిపడ్డారు. గిరి శిఖర గ్రామాల్లో గిరిజనులు డోలీల సాయంతోనే వైద్యం కోసం వస్తున్నారని తెలిపారు. గిరిజనులకు ఉపాధి లేకున్నా నిత్యవసరాల ధరల రోజు రోజుకు అమాంతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలను మోసగించే పనిలో ఉన్నారు తప్ప ఉపాధి కల్పన చర్యలు మాత్రం చూపడం లేదన్నారు. యువ గళం, దీపం, అన్నదాత, మహాశక్తి, పూర్ టూ రిచ్, బిసిలకు భరోసా, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, తల్లికి వందనం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి వంటి ప్రజా రంజకమైన పథకాలతో టిడిపి రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. దీని కోసం తామంతా కలిసి కట్టుగా పనిచేస్తామని కార్యకర్తలంతా విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన పంచా యతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజల సమస్య లను పరిష్క రించి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్ తెలిపారు. టెంక సింగి, కోసింగి భద్ర, గుణద, సంధి గూడ గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నా మన్నారు. విద్య ఆవశ్యకతను ప్రజలకు వివరించి తమ పిల్లలను పాఠశాలలకు పంపించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని గ్రామంలో యువతతో అప్పుడప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలుంటుందని అన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన సెగ్మెంట్ పరిధిలో గిరిజ నులు ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా గిరిజనులకు తాగు నీరు, సాగు నీరు అందడం లేదన్నారు. చాలామంది గిరిజనులు తరతరాల నుంచి పోడు వ్యవసాయం చేస్తున్నా పట్టాలు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. కొండల మీద గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్యం సరిగ్గా అందడం లేదని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలని, జిఒ నెంబర్ 3 పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు.



ఉత్పత్తిలో రెండో స్థానం.. ధరలో దయనీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జీడిసాగులో కేరళ దేశంలో మొదటి స్థానంలోవుండగా, మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. దేశ, విదేశాలకు ఇక్కడి నుంచే జీడిపప్పు ఎగుమతి అవుతోంది. వెయ్యికిపైగా జీడి పరిశ్రమలు ఉండగా వాటిలో లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది జీవనోపాధి పొందుతున్నారు. మద్ధతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో జీడి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే జీడిపరిశ్రమ కూదేలవుతుందని, ఫలితంగా రాష్ట్రంలోవున్న కాస్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కోల్పోవాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుందని పలువురు భావిస్తున్నారు. 80 కేజీ బస్తాకు రూ.15వేలు నుంచి రూ.16వేల వరకు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న విషయం విధితమే. ఉమ్మడి 8 జిల్లాల్లో 4,57,500 ఎకరాల్లో జీడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో సుమారు 65,000 వేల ఎకరాల్లోనూ, విజయనగరం

జిల్లాలో గిరిజన ప్రాంతాలలో సుమారు 60,000 ఎకరాల్లో జీడితోటలు విస్తరించివున్నాయి. జీడితోటల దుక్కి, గొప్పులు, క్రిమిసంహారక మందులు, ఎరువులు తదితర భారీగానే పెట్టుబడులు అవుతున్నాయి. జీడి సాగుచేస్తున్న కుటుంబాల్లో ఎక్కువ భాగం ఇదే జీవనాధారం. పిల్లల, చదువులు, పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యాలు జీడి ఉత్పత్తుల సీజన్‌తో ముడిపడి ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2లక్షల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యగల జీడితోటల ఆధారంగా శ్రీకాకుళం జిల్లా పలాస, విజయనగరం జిల్లా మరుపల్లి, తూర్పుగోదావరి జిల్లా మోరి, ప్రకాశం జిల్లాలో వేటపాలెం ప్రాంతాల్లో జీడిపరిశ్రమలు ఎక్కువగా ఆవిర్భవించాయి. ఏటా 99వేల

జీడి రైతుల్ని వీడని కష్టాలు

ఉన్నుల ఉత్పిత్తితో దేశంలో రెండువస్థానంలో ఉంది. మన రాష్ట్రంలోని జీడిపప్పుకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం, పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట, కవిటి మండలాలు జీడి సాగుకు అత్యంత అనుకూలం. ఒక్క పలాస ప్రాతంలో 250 పరిశ్రమలు ఉన్నాయి. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పలాస జీడిపప్పుకు డిమాండ్ ఉంది. ఒకప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానమునకు పలాస జీడిపప్పు కొనుగోలు చేసేవారు. అందుకే చాలా చోట్ల జీడిపరిశ్రమలు ఉన్నప్పటికీ పలాస జీడి మార్కెట్ ధరల నిర్ణయంలో ప్రధాన ప్రాత వహిస్తుంది. జీడి సాగు, ప్రాససింగ్‌లో ఎక్కువగా గిరిజనులు ఆధారపడి జీవిస్తున్నారు. వరి, గోధుమ, చెరకు వంటి పంటల మాదిరిగా మద్దతు ధర లేకపోవడంతో జీడి రైతులు వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సివస్తోంది. బహిరంగ మార్కెట్‌లో జీడి పప్పుధర ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ రైతుల వద్ద 80కేజీల జీడి పిక్కల బస్తా ధర రూ.8వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో, రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జీడి రైతులు మద్దతు ధర కోసం రోడ్లెక్కారు. 80 కేజీ బస్తాకు రూ.15వేలు నుంచి రూ.16వేల వరకు ధర చెల్లించాలని, మిగతా ఆహార పంటలు మాదిరిగా జీడిపంటకు కూడా ఏటా మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. పలాస కేంద్రంగా జీడి పరిశోధన కేంద్రం, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. కేరళలోని రబ్బరు, కాయర్బోర్డు మాదిరిగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని కూడా కోరుతున్నారు. ఇప్పటికే చాలా జిల్లాల్లో ధర్నాలు, రోస్తారోకోలు తదితర రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. గతంలో పలాస శాసన సభ్యులు సీదిరి అప్పలరాజు దృష్టికి, ఆయన ద్వారా దష్టికి సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని జీడిపిక్కల రైతాంగ పోరాట కమిటీ, సిపిఎం తదితర వామపక్షాలు పార్టీలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం పురపాలకులు వీరే...

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం మేజర్ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా 1959లో ఏర్పాటైంది. అప్పటి నుంచి మున్సిపల్ చైర్‌మెన్లుగా అనేక మంది పదవులు అలంకరించారు. అయితే మధ్య మధ్యలో ప్రత్యేకాధికారుల పాలన కూడా సాగింది. 1959 అక్టోబర్ 1న బి.శేషయ్య తొలి మున్సిపల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈయన 1960 ఏప్రిల్ 26 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం కె.శేషయ్య 1961 ఆగస్టు 15 వరకు, ఆర్‌కె ప్రగడ 1962 మార్చి 5 వరకు కార్యదర్శిగా పనిచేశారు. తదనంతరం మున్సిపల్ చైర్మన్ వ్యవస్థ తెరపైకి వచ్చింది. మొదటి మున్సిపల్ చైర్మన్‌గా తిరుమళ్ల రామ్మూర్తి 1962 మార్చి6 నుండి 1967 మార్చి 31 వరకు పాలన సాగించి, మళ్లీ 1972 సెప్టెంబర్ 31 వరకు చైర్‌మెన్‌గా కొనసాగారు. 1972 అక్టోబర్ నుండి 1973 జూన్ వరకు పి.సూర్యనారాయణ ప్రత్యేక అధికారిగా పనిచేశారు. అనంతరం 1976 వరకు వి.సత్యనారాయణ, 1978 నవంబర్ 13 నుండి డిసెంబర్ 12 వరకు ప్రకాశరావు ప్రత్యేక అధికారులుగా పనిచేశారు. 1980 డిసెంబర్ 4 వరకు పి.వెంకటేశ్వరరావు, 1981 ఆగస్టు 30 వరకు కమిషనర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. 1981 ఆగస్టు 31 నుండి 1983 ఏప్రిల్ 9 వరకు తిరుమళ్ల రామ్మూర్తి మూడోసారి మున్సిపల్‌చైర్మన్‌గా పాలన సాగించారు. ఆయన అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆయన సోదరుడు అప్పటి వైస్ చైర్మన్ తిరుమళ్ల బాబురావు 1986 వరకు మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించారు. 1986 జూలై 1 నుంచి 1987 మార్చి 29 వరకు అప్పటి సబ్ కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. అనంతరం1992 మే 31 వరకు ఐదేళ్ల పాటు తెలుగుదేశం పార్టీ నుంచి ప్రత్యక్షంగా పోటీచేసిన గెలిచిన బచ్చల తిరుపతిరావు మున్సిపల్ చైర్మన్‌గా ఐదేళ్లపాటు పాలన సాగించారు. అనంతరం 1992 జూన్ 1 నుండి 1993 ఆగస్టు 20 వరకు ఆర్‌డిఒ బివి శంకరయ్య, 1993 ఆగస్టు 26 నుండి 1995 మార్చి 28 వరకు సబ్ కలెక్టర్ ఆర్‌పి సిసోడియా ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన మజ్జి నాగమణి మొట్టమొదటి మహిళా చైర్‌పర్సన్‌గా 1995 మార్చి 25 నుండి 2000 సంవత్సరం మార్చి 25 వరకు ఐదేళ్లపాటు పాలన సాగించారు. అనంతరం టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన ముక్కల జయన్న 2000 సంవత్సరం మార్చి 29 నుండి 2005 మార్చి 25 వరకు చైర్మన్‌గా కొనసాగారు. 2005 మార్చి 29 నుండి సెప్టెంబర్ 30 వరకు ఎ.జగదీష్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఏకగ్రీవంగా కౌన్సిలర్‌గా ఎన్నికైన అప్పటి మంత్రి శత్రుశర్ల విజయరామరాజు సోదరి నరసింహ ప్రియా థాట్రాజ్ 2010 సంవత్సరం వరకు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. అప్పటి నుండి 2014 వరకు అప్పటి ఐటిడిఎ పిఒలు జి.సువర్ణ పండాదాస్, బిఆర్.అంబేద్కర్, రజిత్ కుమార్ సైనీలు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించారు. 2014 జూలైలో జరిగిన ఎన్నికలలో టిడిపి తరపున ద్వారపురెడ్డి శ్రీదేవి మూడో మహిళా చైర్పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించి 2019 వరకు పాలన సాగించారు. అంతవరకు గ్రేడ్-2 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం మున్సిపాలిటీ గ్రేడ్-1 మున్సిపాలిటీ జాబితాలో చేరింది. అనంతరం మున్సిపల్ ప్రత్యేక అధికారులుగా ఐటిడిఎ పిఒ డాక్టర్ వి.వినోద్ కుమార్, అనంతరం భోగాపురం భూసేకరణ ప్రత్యేక అధికారిగా తోటపల్లి ప్రాజెక్ట్ ఇంచార్జ్ అధికారిగా ఉన్న వెంకటేశ్వరరావు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించారు. అనంతరం 2021 మార్చిలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో వైసిపి తరపున మున్సిపల్ నాలుగో మహిళా చైర్‌పర్సన్‌గా బోను గౌరీశ్వరి చైర్ పర్సన్ గా కొనసాగుతున్నారు.

మారని పారిశుధ్య కార్మికుల జీవితాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ ఏర్పడిన నుండి నేటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా, పాలకులు, అధికారులు మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారలేదనే చెప్పాలి. పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారంటే దీనికి కారణం పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలే అని చెప్పుకోవచ్చు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ పట్టణంలో ఉన్న అన్ని వార్డులనూ పరిశుభ్రంగా ఉంచేందుకు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి రహదారులపై ఉన్న చెత్తను, వ్యర్థాలను తొలగిస్తూ కాలువలను శుభ్రం చేస్తూ, ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తూ పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా కష్టించి పారిశుధ్య నిర్వహణ చేస్తున్నప్పటికీ వీరి జీవితాలలో వెలుగు లేదనే చెప్పాలి. కార్మికులు నివసిస్తున్న ప్రాంతాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత కూడా ప్రభుత్వం చేపట్టకపోవడం గమనార్హం. పట్టణ విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. శివారు ప్రాంతాలలో కాలనీలు కూడా అభివృద్ధి చెందుతున్నాయి. జనాభా కూడా పెరుగుతూనే ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికులు సంఖ్య పెరగడం లేదు. దీని వల్ల కార్మికులకు పని భారం ఎక్కువవుతుంది.

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఉన్న మునిసిపాలిటీలో 37 మంది పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు, 88 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు విధులను నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, దుస్తులు, సరఫరా లేక అవస్థలు పడుతున్నారు. చాలీచాలని రక్షణ పరికరాలు ఇవ్వడంతో రక్షణ పరికరాలు లేకుండానే పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నారు. దీని మూలంగా పలువురు కార్మికులు అనారోగ్యం బారిన పడి మరణిస్తున్నారు. వెట్టిచాకిరి చేస్తూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణకు భారంగా అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు.

ప్రతిపక్ష హోదాల పాదయాత్ర చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు దాటిన ఇంతవరకు పర్మినెంట్ చేయలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను కూడా పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉందని అనేక సందర్భాలలో పలుమార్లు నిరసనలు, ధర్నాలు, సమ్మెలు ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ సమస్యలు పరిష్కరించేందుకు కనీసం స్పందించకపోవడం దారుణమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కారుణ్య నియమకాలు చేయాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ఆప్కాస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు వచ్చి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలి

ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీను నెరవేర్చాలి. మా కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి.

నాగవంశం మల్లేష్,
పారిశుధ్య కార్మిక యూనియన్

ఏళ్లుగా వెట్టి చాకిరీ

ఎన్నో ఏళ్ల నుండి వెట్టి చాకిరి చేస్తూనే ఉన్నాం అయినా మా బ్రతుకులు గాని, మా పిల్లల బ్రతుకులు గాని మారడం లేదు. ప్రభుత్వం స్పందించి మా కష్టానికి తగ్గ వేతనం ఇవ్వాలి. మా సమస్యలను పరిష్కరించాలి.

చీపురుపల్లి సింహాచలం,
పారిశుధ్య కార్మిక యూనియన్ అధ్యక్షులు

ఆదివాసీలకు అండగా ఆర్ట్స్

- 30 ఏళ్లుగా కార్యక్రమాలు
- చైల్డ్‌లైన్ ద్వారా 800 బాల్యవివాహాలు నిలుపుదల
- 6వేల మంది బడిబయట విద్యార్థులను బడిలో చేర్పింపు
- క్షయ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ
- ముఖ్యమంత్రి, అధికారుల నుంచి ప్రశంసలు

సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సన్యాసిరావు (ఫైల్)

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీలకు అండగా నిలుస్తోంది ఆర్ట్స్ సంస్థ. 30 ఏళ్లుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ గిరిజనులకు వాటి ఫలితాలు చేరవేస్తోంది. గిరిజనుల్లో చెరగని ముద్ర వేసుకొని తనకంటూ ప్రత్యేకతను చాటుకుంది. గిరిజనాభివృద్ధికి బాటలు వేయడమే కాదు, సాంఘిక దురాచారాలపై చైతన్యం చేసి, సామాజిక విప్లవానికి నాంది పలికింది. ఏజెన్సీలో గిరిజనుల మన్ననలు పొందిన సంస్థగా పేరు తెచ్చుకుంది. ముఖ్యమంత్రితోపాటు అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది.

ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు.. 1993లో ఈ సంస్థ ఏర్పాటు చేశారు. తొలుత బూర్జ మండలంలో పెద్దపేట గ్రామంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టి వాటి ద్వారా పంటలు పండేటట్టుగా ప్రయత్నించారు. వన సంరక్షణ సమితులు ఏర్పాటుచేసి, అటవీ సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనులు సాధికారిక హక్కుల కోసం చైతన్యపరిచేందుకు కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. శిక్షణ ఇచ్చి భూమిలేని వారికి పట్టాలు చేయించారు. అటవీ హక్కుల చట్టం -2005పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో వనరులు గుర్తింపు పద్ధతిలో వ్యక్తిగత, సామూహిక హక్కులను అందించారు. ఐదో షెడ్యూల్ సాధనకు యాత్రను నిర్వహించి గ్రామాల్లో అవగాహన కల్పించారు. షెడ్యూల్ ఏరియా సర్పంచుల ఐక్యతా సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామసభల నిర్వహణతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆదివాసీ ప్రాంతాల్లో మారుమూల గ్రామాలకు ప్రభుత్వ పథకాలపైన, ఆహార భద్రత పథకాలపైన సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించేందుకు కృషి చేశారు.

గిరిజనాభివృద్ధికి దన్ను

నాబార్డు, రూరల్ డెవలప్‌మెంట్ సహకారంతో సీతంపేట, బూర్జ మండలాల్లో వాటర్ షెడ్ కార్యక్రమం ద్వారా సుమారుగా 15 వేల ఎకరాలను అభివృద్ధిచేశారు. సహజ వనరులను అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గొలుసు చెరువులు అభివృద్ధి చేయడం, చేపల పెంపకం. చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. 1230 ఎకరాల్లో మొక్కలు నాటించి, వాటి ద్వారా ఆదాయం పొందే విధంగా కృషిచేశారు. ఏడాదిలో రెండు పంటలు పండేలా అభివృద్ధి చేశారు. మాతోట కార్యక్రమం ద్వారా వెయ్యి ఎకరాల్లో జీడి, ఉసిరి, పనస, సీతాఫలం, నేరడి వంటి మేలు రకమైన మొక్కలు పంపిణీ చేశారు. నేల సంరక్షణ పనులు నిర్వహించారు. వారికి జీవనోపాధుల కింద వెదురు బొమ్మల తయారీ, చీపురు అల్లికలు, ట్రైబల్ పెయింటింగ్ శిక్షణ ఇచ్చి, సుస్థిర ఆదాయం పొందే విధంగా నడుం బిగించారు. సీతంపేటలో 60 గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా సమీకృత వ్యవసాయ విధానం అమలు చేశారు. వ్యవసాయం, ఉద్యాన పంటల అభివృద్ధి, చేపలు, నాటుకోళ్ళు, మేకల పెంపకంపై దృష్టిసారించేలా చేశారు. అన్ని కాలాల్లో కూడా పంటలు పండించి, భూమిలో సారవంతం పెంచి చిరుధాన్యాలతో సాగు చేయించడం, సహజ కషాయాలతో పంటలు పండించి నేలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

చదువు ప్రాధాన్యతను గుర్తించి

చదువే అన్నింటికీ మూలం. గిరిజనుల అభివృద్ధి చదువుతోనే సాధ్యమవుతుందని, వారికి భవిష్యత్తు లభిస్తుందని ఆర్ట్స్ సంస్థ నమ్మింది. అందుకే సున్నా నుండి 18 ఏళ్ల వరకు బాలబాలిక సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. 6 వేల మంది బడి బయట పిల్లలను గుర్తించి, మళ్ళీ వారికి స్పెషల్ ఎడ్యుకేషన్ ద్వారా చదువులు చెప్పించి పాఠశాలలో చేర్పించింది. చైల్డ్‌లైన్ ద్వారా 800 బాల్యవివాహాలు ఆపించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

రైతుల సంఘటితంతో..

ఆర్ట్స్ సంస్థ కేవలం బూర్జ, సీతంపేట మండలాలకే పరిమితం కాలేదు. క్రమంగా ఇతర జిల్లాలకూ సేవలను విస్తరించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల్లో 35 రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను ఏర్పాటు చేసింది. 15 వేల మంది రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రైతు పండించే పంటను గిట్టుబాటు ధర వచ్చే విధంగా, వస్తువు విలువ ఆధారిత అభివృద్ధి జరిగేలా శిక్షణ ఇచ్చి ఆదాయాల పెరుగుదలకు కృషి చేశారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించి, వాటితో బిస్కెట్లు, పౌడర్లు తయారుచేసి మార్కెట్‌లో విక్రయించేలా కృషి చేశారు. పైనాపిల్, పనస మార్కెటింగ్, జాములు, జ్యూస్‌లు, పచ్చళ్లు, పనస చిప్స్ పౌడర్ మొదలైన వస్తువుల విలువ ఆధారిత కార్యక్రమాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో చేయించారు. ఈ విధంగా రైతులకు, ఒంటరి మహిళలకు జీవనోపాధి కార్యక్రమాల కింద సహాయం చేశారు. వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఆదాయం పెరిగేలా కృషి చేశారు. సిక్కోలు చేనేత కంపెనీ ఏర్పాటు చేసి, 500 మంది సభ్యులకు కొత్త రకం డిజైన్లపై శిక్షణ ఇప్పించి, అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేశారు.

ఎన్నో అవార్డులు

ఆర్ట్స్ సంస్థ గిరిజనులకు చేసిన సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛంద సంస్థగా గుర్తింపబడి ఎన్నో అవార్డులు అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ అభివృద్ధి కింద అవార్డు పొందింది. 2012లో జాతీయస్థాయి యువజన అవార్డును సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు అందుకున్నారు. 2013లో జాతీయస్థాయి జెండా ఫౌండేషన్ నుంచి అవార్డు దక్కించుకున్నారు. 2021లో వైఎస్ఆర్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు. నాబార్డు నుంచి రాష్ట్ర అవార్డులను దక్కించుకున్నారు. ఇటీవల నాబార్డ్ 42వ ఫౌండేషన్ డే సందర్భంగా రాష్ట్ర మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవార్డు దక్కించుకున్నారు. 30 ఏళ్లుగా సహకరించిన నాబార్డు అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్, యాక్సిడైడ్, చైల్డ్‌లైన్ సంస్థకు ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సన్యాసిరావు శంకర్రావు; ఏరియా ఆసుపత్రిలో రోగులకు పోస్ట్ ఆహార కిట్లు పంపిణీ చేస్తున్న సన్యాసిరావు

ఆహ్లాదకరంగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ

విల్లు ఆకారంలో ప్రధాన ద్వారం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

అందం, ఆహ్లాదం, ప్రకృతి సౌందర్యం గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ సొంతం. అందమైన ప్రకృతి సోయగాలు... జాలువారే జలపాతాలు చూసేందుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు చర్యలు చేపడుతున్నారు. సవర కోటపాడు ఉద్యానవన నర్సరీ శిక్షణ కేంద్రం పర్యాటక ప్రాంతం వైపు అడుగులు వేస్తోంది. 38 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ఈ నర్సరీలో సిమెంటు రోడ్డు, ఆర్చి గోడ, యోగా ప్రతిమలు, పద్మవ్యూహం, అల్లూరి విగ్రహం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఇవి పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. బోటు షికారు, చిన్నపిల్లల పార్క్, పూలతోటల పెంపకం వంటి పనులు చేపట్టేందుకు పనులు వేగవంతమవుతున్నాయి. మరోవైపు తాడికొండ, మొగనాలి గెడ్డ జలపాతం పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చెందింది. జాలువారే జలపాతం చూసేందుకు శ్రీకాకుళం, పార్వతీపురం, ఒడిశా ప్రాంతాలనుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వనభోజనాలు ఎక్కువగా ఇక్కడ జరుగుతుంటాయి. పర్యాటకుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించి, అభివద్ధి పరచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తాడికొండ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అత్యున్నత లక్ష్యాలు...
ఉన్నత విలువలు అంకితభావంతో...
విపత్కర పరిస్థితులను అధిగమించి...
ప్రజాశక్తి అభివృద్ధికి కృషి చేస్తున్న
పాత్రికేయులకు, సిబ్బందికి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
గౌ॥ శ్రీ అలజంగి జోగారావు గారు
ఎమ్మెల్యే, పార్వతీపురం
గుడివాడ జగన్
వైసిపి నాయకులు, పెదపెంకి,
బలిజిపేట మండలం
శ్రీమతి గుడివాడ నాగమణి
ఎంపిపి,
బలిజిపేట మండలం
బలిజిపేట మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల
అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం
చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక
ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న సందర్భంగా
ఇవియే శుభాకాంక్షలు
బోనెల విజయచంద్ర
టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి,
పార్వతీపురం
పెంకి వేణుగోపాల నాయుడు
తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు, పెదపెంకి,
బలిజిపేట మండలం, పార్వతీపురం నియోజకవర్గం
శ్రీమతి పెంకి పార్వతి
మాజీ ఎంపిపి, పెదపెంకి, బలిజిపేట మండలం,
పార్వతీపురం నియోజకవర్గం
తెలుగుదేశం పార్టీ - బలిజిపేట మండలం

VOTE FOR GLASS
ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
"నిజాయితీని నమ్ముకున్న
జనసేనతోనే నడుద్దాం
నిజమైన ప్రజాప్రభుత్వాన్ని
స్థాపిద్దాం"
హాయ్..హాయ్.. ఎపి
బై.. బై...వైసిపి
అక్కివరపు మోహనరావు
జనసేన పార్టీ నాయకులు,
పార్వతీపురం నియోజకవర్గం
జన సైనికులు, వీరనారీమణులు, కార్యకర్తలు
జనసేన పార్టీ - పార్వతీపురం నియోజకవర్గం